


hindustanmedia333@gmail.com APTEL / 2004 / 19136

# హిందుస్థాన్ మీడియా

తెలుగు దిన పత్రిక

సామాన్యుడి నేస్తం




ఎడిటర్ : తాడెం. ప్రశాంత్ సిద్దిపేట సంపుటి : 1 సంచిక : 15 గురువారం, 30, ఏప్రిల్ 2026, పేజీలు - 8 వెల :4/-

## కేటీఆర్, హరీశ్ రావుపై కాంగ్రెస్ నేత సంపత్ కుమార్ పరువు నష్టం దావా



బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఆ పార్టీ సీనియర్ నేత హరీశ్ రావులపై ఏఐసీసీ కార్యదర్శి సంపత్ కుమార్ పరువు నష్టం దావా వేశారు. నాంపల్లి ప్రజాప్రతినిధుల కోర్టులో వారిపై దావా వేశానని ఆయన తెలిపారు. వారు తనపై, కాంగ్రెస్ పార్టీపై తప్పుడు ప్రచారం చేశారని ఆరోపించారు. మూడు నెలల క్రితం జరిగిన చిన్న సంఘటనను ఆధారంగా చేసుకుని తనపై వారు తప్పుడు ప్రచారం చేశారని మండిపడ్డారు.వారు తమ సొంత మీడియా, సోషల్ మీడియాలో తమపై అసత్య ప్రచారం చేసి, తమ ప్రతిష్ఠకు భంగం కలిగిస్తున్నారని వాపోయారు.

## రైతులు పండించిన

# చివరి గింజ వరకు కొనుగోలు

### మంత్రి ఉత్తమ్ కుమార్



**హైదరాబాద్, ఏప్రిల్ 29:** తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా యాసంగి వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియ అత్యంత వేగంగా, పారదర్శకంగా సాగుతోందని పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ వెల్లడించారు. రైతులకు కనీస మద్దతు ధర కల్పిస్తూ, ఎక్కడా ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని ఆయన స్పష్టం చేశారు. ఈ యాసంగి సీజన్‌లో రాష్ట్రవ్యాప్తంగా 141 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా వేస్తున్నారు.ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ మాట్లాడుతూ.. 'ప్రభుత్వం ఈ సీజన్‌లో 90 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించాలని లక్ష్యంగా పెట్టుకుంది.



## తెలంగాణలో ఉద్యోగులకు రూ.1000 కోట్ల బకాయిల విడుదల

**హైదరాబాద్, ఏప్రిల్ 29:** తెలంగాణలో ఉద్యోగుల బకాయిలను ప్రభుత్వం విడుదల చేసింది. బుధవారం ఆర్థికశాఖ రూ.1000 కోట్లను రిలీజ్ చేసింది. రిటైర్డ్ ఉద్యోగుల జీపీఎఫ్ బకాయిలను సర్కార్ చెల్లించింది. దీంతో 2025 అక్టోబర్ వరకు బకాయిలను ప్రభుత్వం క్లియర్ చేసింది. గతంలో ఉద్యోగులకు ఇచ్చిన హామీ మేరకు ఇప్పటివరకు ప్రతి నెల ఉద్యోగుల బకాయిల కోసం ప్రభుత్వం రూ.700 కోట్ల చొప్పున చెల్లిస్తూ వస్తోంది.

## తెలంగాణలో పెట్రోల్, డీజిల్ కొరతపై

# ప్రభుత్వం క్లారిటీ..

### ధరల పెరుగుదల వదంతులతోనే రాష్ట్రంలో ఇంధన కొరత ఏర్పడిందన్న మంత్రి



**హైదరాబాద్,** తెలంగాణలో గత మూడు రోజులుగా పలు ప్రాంతాల్లో నెలకొన్న పెట్రోల్, డీజిల్ కొరతపై రాష్ట్ర ప్రభుత్వం స్పష్టతనిచ్చింది. ఇంధన ధరలు భారీగా పెరగబోతున్నాయంటూ వ్యాపించిన వదంతుల వల్లే ఈ కృత్రిమ కొరత ఏర్పడిందని పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు. ప్రజలు ఆందోళనతో అవసరానికి మించి ఇంధనాన్ని కొనుగోలు చేస్తుండటంతో బంకుల వద్ద భారీ రద్దీ ఏర్పడి, డిమాండ్ అకస్మాత్తుగా పెరిగిందని వివరించారు. ఈ పరిస్థితికి పలు కారణాలు దోహదం చేశాయని ప్రభుత్వం పేర్కొంది. పశ్చిమ బెంగాల్ ఎన్నికల తర్వాత ఇంధన ధరలు పెరుగుతాయనే ప్రచారం ప్రజల్లో ఆందోళన రేకెత్తించింది.



## ఎగ్జిట్ పోల్స్: బెంగాల్‌లో హోరాహోరీ

దేశవ్యాప్తంగా ఆసక్తి రేపిన కేరళ, తమిళనాడు, పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ముగియడంతో, పలు జాతీయ సర్వే సంస్థలు తమ ఎగ్జిట్ పోల్స్ అంచనాలను విడుదల చేశాయి. ఈ అంచనాలు మిశ్రమ ఫలితాలను సూచిస్తున్నాయి. ముఖ్యంగా పశ్చిమ బెంగాల్‌లో నువ్వానేనా అన్నట్టు పోటీ ఉండగా, తమిళనాడులో డీఎంకే కూటమి వైపు మొగ్గు కనిపిస్తోంది. కేరళలోనూ హోరాహోరీ పోరు తప్పదని సర్వేలు చెబుతున్నాయి.

**తమిళనాడు ఎగ్జిట్ పోల్స్ (మొత్తం స్థానాలు: 234)**

తమిళనాడులో డీఎంకే కూటమి మరోసారి అధికారం చేపట్టే అవకాశాలున్నాయని చాలా సర్వేలు అంచనా వేశాయి. అయితే, నటుడు విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కళగం (టీవీకే) పార్టీ గణనీయమైన ఓట్లను సాధించి, రాజకీయాల్లో కీలక శక్తిగా అవతరించినట్లు తెలుస్తోంది.



## తెలంగాణ సచివాలయంలో నకిలీ పోలీస్ హల్‌చల్..

**హైదరాబాద్** తెలంగాణ సచివాలయంలో భద్రతా లోపం మరోసారి బట్టబయలైంది. నిఖిల్ అనే వ్యక్తి పోలీస్ అధికారిగా నటిస్తూ, ఏకంగా సచివాలయంలోకి ప్రవేశించి వీడియోలు చేయడం తీవ్ర కలకలం రేపుతోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కల్పిస్తానని, ఐపీఎల్ టికెట్లు ఇప్పిస్తానని చెబుతూ అతను చిత్రీకరించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి.



## ప్రభుత్వం చేతికి హైదరాబాద్ మెట్రో..

# నేడో రేపో ఒప్పందం

**హైదరాబాద్,** హైదరాబాద్ మెట్రో రైలు మొదటి దశ ప్రాజెక్టు పూర్తిగా ప్రభుత్వపరం కానుంది. ప్రైవేటు భాగస్వామ్యంతో (పీపీపీ) నడుస్తున్న ఈ ప్రాజెక్టును రాష్ట్ర ప్రభుత్వం స్వాధీనం చేసుకునే ప్రక్రియ తుది దశకు చేరుకుంది. ఇందుకు సంబంధించి వాటా కొనుగోలు ఒప్పందం (ఎస్‌పీఏ)పై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఎల్ అండ్ టీ ఛైర్మన్ ఎస్.ఎన్.సుబ్రమణ్యం సమక్షంలో సంతకాలు జరగనున్నాయి.మంగళవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు అధ్యక్షతన సమావేశమైన హెచ్ఎంఆర్ఎల్ బోర్డు.. ఈ స్వాధీన ప్రక్రియకు ఆమోదముద్ర వేసింది.

## తెలంగాణలో టెన్త్ ఫలితాలు విడుదల...

# బాలికలదే పైచేయి

- తెలంగాణ పదో తరగతి ఫలితాలు విడుదల, 95.15 శాతం ఉత్తీర్ణత
- ఫలితాల్లో బాలికలదే పైచేయి, 96.26 శాతం మంది పాస్
- తొలిసారిగా వాట్సాప్ ద్వారా ఫలితాలు పొందే సౌకర్యం
- ఈ ఏడాది నుంచి గ్రేడ్లకు బదులుగా సబ్జెక్టుల వారీగా మార్కులు



**హైదరాబాద్** తెలంగాణలో పదో తరగతి పరీక్షల ఫలితాలను విడుదల చేశారు. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 95.15 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్టు అధికారులు ప్రకటించారు. సీనియర్ నేత కే. కేశవరావు ఈ ఫలితాలను అధికారికంగా విడుదల చేశారు.ఎప్పటిలాగే ఈసారి కూడా ఫలితాల్లో బాలికలే పైచేయి సాధించారు. బాలికలు 96.26 శాతం ఉత్తీర్ణత సాధించగా, బాలురు 94.07 శాతంతో కాస్త వెనుకబడ్డారు. మార్చి 14 నుంచి ఏప్రిల్ 13 వరకు జరిగిన ఈ పరీక్షలకు రాష్ట్రవ్యాప్తంగా సుమారు 5,28,239 మంది విద్యార్థులు హాజరయ్యారు.

## మొండిచింత కాలనీ వద్ద ప్రమాద ఘంటికలు భద్రతా చర్యల కోసం ప్రజల వేడుకోలు

చేర్యాల, ఏప్రిల్ 29హిందూస్థాన్ మీడియా

సిద్దిపేట జిల్లా చేర్యాల పట్టణ కేంద్రంలోని మొండిచింత కాలనీ -- శ్రీరామ్ నగర్ కాలనీల మధ్య ఉన్న నేషనల్ హైవే రహదారి ప్రస్తుతం ప్రమాదాలకు కేంద్రంగా మారింది. జనగాం నుండి సిద్దిపేట వరకు సాగిన నాలుగు లైన్ల రహదారి నిర్మాణ పనులు దాదాపు పూర్తయ్యాయి. అయితే, ఈ రెండు కాలనీల మధ్య ఉన్న డివైడర్ వద్ద అవసరమైన భద్రతా చర్యలు చేపట్టకపోవడం స్థానికుల్లో తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. మొండిచింత కాలనీలో ప్రాథమిక పాఠశాలతో పాటు రిజిస్ట్రేషన్ కార్యాలయం ఉండగా, శ్రీరామ్ నగర్ కాలనీకి చెందిన విద్యార్థులు ప్రతిరోజూ ఈ రహదారిని దాటాల్సి వస్తోంది. ఉదయం, సాయంత్రం సమయంలో చిన్నారులు డివైడర్ దాటి వెళ్తుండటం ప్రమాదాలకు దారితీస్తోంది. వేగంగా దూసుకెళ్తున్న వాహనాల మధ్య పిల్లలను రోడ్డు దాటించాల్సిన పరిస్థితి తల్లిదండ్రుల్లో భయాందోళనలకు కారణమవుతోంది. ప్రస్తుతం అక్కడ జీబ్రా క్రాస్ లైన్, ఎల్లో సిగ్నల్ లైట్, బారికేడ్లు వంటి ప్రాథమిక రహదారి భద్రతా ఏర్పాట్లు ఏవీ లేకపోవడం గమనార్హం. డివైడర్ వద్ద వీధి దీపాలు ఉన్నప్పటికీ అవి పనిచేయకపోవడం పరిస్థితిని మరింత ప్రమాదకరంగా



మారుస్తోంది. ఇప్పటికే ఈ ప్రాంతంలో పలు రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకున్నాయని స్థానికులు చెబుతున్నారు. నేషనల్ హైవే పనులు చేపట్టిన కాంట్రాక్టర్ నిర్లక్ష్యమే ఈ సమస్యలకు కారణమని ప్రజలు ఆరోపిస్తున్నారు. డివైడర్ నిర్మాణం చేసి, అవసరమైన సౌకర్యాలు ఏర్పాటు చేయకుండా వదిలేయడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీనిపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి, మొండిచింత కాలనీ డివైడర్ వద్ద జీబ్రా క్రాస్ లైన్, ఎల్లో లైట్ ఏర్పాటు చేయడంతో పాటు వీధి దీపాలను పనిచేయించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. అలాగే స్థానిక పోలీసులు తక్షణమే బారికేడ్లు ఏర్పాటు చేసి ప్రమాదాలను నివారించాల్సిన అవసరం ఉందని కోరుతున్నారు. ప్రజల ప్రాణ భద్రత దృష్ట్యా ఆలస్యం చేయకుండా తక్షణ చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని స్థానికులు

# గ్రామ గ్రామాన ఎర్రజెండాలతో మే డే ను

## జయప్రదం చేయండి: సిపిఎం కార్యదర్శి అరుణ్ పిలుపు

చేర్యాల, ఏప్రిల్ 29 హిందూస్థాన్ మీడియా

ప్రపంచ కార్మిక దినోత్సవం 'మేడే'ను గ్రామ గ్రామాన ఘనంగా నిర్వహించాలని, ప్రతి వాడవాడలో ఎర్రజెండాలను ఎగురవేసి జయప్రదం చేయాలని సిపిఎం చేర్యాల మండల కార్యదర్శి బండకింది అరుణ్ పిలుపునిచ్చారు. మండల పరిధిలోని శబాష్‌గూడెం, నాగపురి, పెద్దరాజుపేట, పోతిరెడ్డి పల్లి, కడవేరుగు తదితర గ్రామాల్లో సిపిఎం, సిటియు హమాలీ కార్మికులను కలిసి ఆయన మాట్లాడారు. మండలంలోని సిపిఎం, సిటియు అనుబంధ కార్మికులు, హమాలీలు, బీడీ కార్మికులు, ఆశ వర్కర్లు, అంగన్వాడీ సిబ్బంది, గ్రామపంచాయతీ కార్మికులు సహా అసంఘటిత రంగ కార్మికులంతా మేడే వేడుకలను ఉత్సాహంగా నిర్వహించాలని ఆయన కోరారు. కార్మికుల ఐక్యత, హక్కుల పరిరక్షణకు మేడే ఒక ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అమెరికాలోని చికాగో నగరంలో కార్మికులు 18 గంటల పని దినాలకు వ్యతిరేకంగా చేసిన పోరాటాల ఫలితంగా 8 గంటల పని విధానం సాధ్యమైందని గుర్తుచేశారు. అయితే ప్రస్తుతం కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం కార్మిక హక్కులను హరించే విధంగా విధానాలు అమలు చేస్తోందని విమర్శించారు. 29 కార్మిక



చట్టాలను నాలుగు లేబర్ కోడ్లుగా మార్చి, కార్మికులకు నష్టం కలిగించే చర్యలు తీసుకుంటోందని ఆరోపించారు. ఎనిమిది గంటల పని విధానాన్ని 12 గంటలకు పెంచే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆయన అన్నారు. కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా కార్మికులు, రైతులు, ప్రజలు మేడే స్ఫూర్తితో ఐక్యంగా పోరాడాలని ఆయన పిలుపునిచ్చారు. కార్మిక హక్కుల పరిరక్షణ కోసం ఉద్యమాలు మరింత బలపడాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు నంగి మైసయ్య, మోకు దేవేందర్ రెడ్డి, మోకు ఇంద్రం, దండ్ల రమేష్, గందాల బాల్, గర్నేపల్లి చంద్రం, దండ్ల కొమురయ్య, కత్తుల నర్సింహారెడ్డి, సిటియు మండల అధ్యక్షులు ఎలుగు రవీందర్, నాయకులు దేవనబోయిన కనకయ్య, ఉల్లంపల్లి రవి, బుచ్చేళ్ళి నర్సింగరావు, ఆవుల నర్సింలు, పుట్ట రాములు, మంజే స్వామి, ఎదుల కనకయ్య, బొడ్డు శంకర్, శ్రీరాముల కనకయ్య, కొయ్యడ భాస్కర్, చంద్రయ్య, రాజు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## నూతన దంపతులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే డా. పల్లా రాజేశ్వర్ రెడ్డి





చేర్యాల, ఏప్రిల్ 29 హిందూస్థాన్ మీడియా

సిద్దిపేట జిల్లా చేర్యాల పట్టణంలో జరిగిన పలు వివాహ వేడుకల్లో జనగామ ఎమ్మెల్యే డా. పల్లా రాజేశ్వర్ రెడ్డి పాల్గొని నూతన దంపతులను ఆశీర్వదించారు. వీరభద్ర గార్డెన్‌లో మాజీ ఎంపిటిసి ముచ్చంతల సుక్కా రెడ్డి -- వినోద దంపతుల కుమారుడు నవీన్ రెడ్డి వివాహం శిరీష రెడ్డితో జరగగా, షణ్ముఖ గార్డెన్‌లో మర్మాముల గ్రామానికి చెందిన జంగిలి యాదగిరి కుమార్తె అమూల్య వివాహం నవీన్‌తో జరిగింది. అలాగే జిఎన్ఆర్ గార్డెన్‌లో కొత్త దొమ్మాట గ్రామానికి చెందిన శెట్టి అంజయ్య కుమార్తె సాత్విక వివాహం రమేష్‌తో జరిగింది. ఈ శుభకార్యాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే నూతన వధూవరులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలుపుతూ, వారి దాంపత్య జీవితం సుఖసంతోషాలతో నిండాలని ఆకాంక్షించారు.



# ప్రభుత్వ పాఠశాలల సత్తా చాటిన చేర్యాల

-SSC ఫలితాల్లో అద్భుత ఫలితాలు

చేర్యాల, ఏప్రిల్ 29 హిందూస్థాన్ మీడియా

2025--26 విద్యాసంవత్సరానికి సంబంధించిన ూజ పరీక్షల ఫలితాల్లో చేర్యాల మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల విద్యార్థులు ప్రతిభ చాటారు. మొత్తం 348 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా, అందులో 342 మంది ఉత్తీర్ణత సాధించడం విశేషంగా నిలిచింది. హాజరైన వారిలో 186 మంది బాలురు, 162 మంది బాలికలు కాగా, ఉత్తీర్ణులలో 182 మంది బాలురు, 160 మంది బాలికలు ఉన్నారు. ఈ ఫలితాలు మండలంలోని విద్యా ప్రమాణాలు మెరుగుపడుతున్నాయనే సంకేతాన్ని ఇస్తున్నాయి. ఈసారి టాప్ ర్యాంకుల్లో వేచరేణి పాఠశాల విద్యార్థులు ఆధిపత్యం చాటారు. బి. సంజన 564 మార్కులతో మొదటి స్థానం సాధించగా, అదే పాఠశాలకు చెందిన బి. అంజలి 554 మార్కులతో రెండో స్థానం దక్కించుకుంది. ముస్త్యాల పాఠశాల విద్యార్థిని జి. నందిని 533 మార్కులతో మూడో స్థానంలో నిలిచింది. అలాగే TGMS ముస్త్యాలలో ఎండి అబ్దుల్ అయాన్ 560 మార్కులు సాధించగా, TGWRS చేర్యాలలో జె. రాజసింహ 547 మార్కులు, కేజీబీవీలో ఎం. శృతి 541 మార్కులు సాధించి ప్రతిభ కనబరిచారు. మండలంలో పలు పాఠశాలలు 100 శాతం ఉత్తీర్ణత సాధించడం ప్రత్యేకంగా నిలిచింది. కడవెరుగు, ముస్త్యాల, నాగపురి, చుంచనకోట, వేచరేణి, గురుజకుంట, దానం పల్లి, వీరన్నపేట, పోతిరెడ్డిపల్లి, పెదరాజపేట, అర్జున్‌పట్ల, TGMS ముస్త్యాల, TGWRS చేర్యాల పాఠశాలలు ఈ జాబితాలో ఉన్నాయి. ఈ సందర్భంగా 100 శాతం ఉత్తీర్ణత సాధించిన పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు మరియు విద్యార్థులను మండల విద్యాధికారి బి. నరేందర్ అభినందించారు. విద్యార్థుల కృషి, ఉపాధ్యాయుల నిబద్ధత, తల్లిదండ్రుల సహకారం కలిసి ఈ విజయానికి కారణమని ఆయన పేర్కొన్నారు. మొత్తంగా చూసుకుంటే, ఈసారి ఫలితాలు చేర్యాల మండలంలో ప్రభుత్వ పాఠశాలలపై ఉన్న నమ్మకాన్ని




మరింత బలపరిచాయి.

## చేర్యాలలోని 12వ వార్డు లో ఇందిరమ్మ ఇళ్లకు శ్రీకారం



చేర్యాల ఏప్రిల్ 29 హిందూస్థాన్ మీడియా

భువనగిరి పార్లమెంట్ సభ్యులు శ్రీ చామల కిరణ్ కుమార్ రెడ్డి సహకారంతో, కొమ్మూరి ప్రతాపరెడ్డి మద్దతుతో చేర్యాల మున్సిపల్ పరిధిలో అభివృద్ధి పనులు ఊపందుకుంటున్నాయి. పట్టణ కేంద్రంలోని 12వ వార్డులో నాగిల్ల లక్ష్మీ -- శేఖర్ నూతన ఇందిరమ్మ ఇల్లు నిర్మాణానికి భూమి పూజ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి వార్డు కౌన్సిలర్ మహమ్మద్ షరీఫా బేగం ఖాజా హాజరై శంకుస్థాపన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఎంపీ సహకారంతో 12వ వార్డుకు మొత్తం 8 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కావడం ఎంతో సంతోషకరమని తెలిపారు. వార్డు ప్రజల తరఫున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. రాబోయే రోజుల్లో కూడా తమ వార్డుకు మరిన్ని ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయించేందుకు తమ వంతు ప్రయత్నం కొనసాగిస్తామని కౌన్సిలర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ కొమ్ము రాజేశ్వరి, పోతుగంటి ప్రసాద్, మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కాటం మల్లేశం, మాజీ కోఆప్షన్ సభ్యుడు ఎండి ఖాజా, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు తాటిపాముల పరశురాములు, పచ్చి మండ్ల వెంకటయ్య గౌడ్, మాచర్ల వెంకట్, తుమ్మలపల్లి సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## చేర్యాలలో విషాదంలిమాజీ సర్పంచ్ యాదయ్య భార్య మృతి

చేర్యాల ఏప్రిల్ 29 హిందూస్థాన్ మీడియా



అంతిమ యాత్రలో పాల్గొని,కుటుంబ సభ్యులను పరామర్శించిన కొమ్మూరి ప్రతాపరెడ్డి చేర్యాల పట్టణానికి చెందిన మాజీ సర్పంచ్ అవుచెర్ల యాదయ్య సతీమణి ప్రమీల అనారోగ్య కారణాలతో మృతి చెందడం తీవ్ర విషాదాన్ని కలిగించింది. ఈ దుర్వార్త తెలిసిన వెంటనే జనగామ నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాపరెడ్డి యాదయ్యను మరియు వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా ప్రమీల మృతికి తన ప్రగాఢ సంతాపాన్ని తెలియజేస్తూ, వారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. బాధలో ఉన్న కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి, ఈ కష్ట సమయంలో తాము అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజలు, ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రమీల కి నివాళులు అర్పించారు.

## ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశాలు
## శుభకార్యాలకు హాజరైన ఆవుల రాజిరెడ్డి

నర్సాపూర్,ఏప్రిల్ 29 హిందూస్థాన్ మీడియా





నర్సాపూర్ నియోజకవర్గంలోని శివ్వంపేట, కొంతన్‌పల్లి, సిరిపుర గ్రామాల్లో నిర్వహించిన ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమాలకు హాజరై లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రభుత్వం అందిస్తున్న పథకాల వల్ల పేదల జీవితాల్లో వస్తున్న మార్పులను ప్రశంసించారు. మెదక్ జిల్లాలో పలు ప్రాంతాల్లో జరిగిన వివాహాలకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేశారు. హథ్నూర మండలం కోనంపేట్ గ్రామంలో నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ జెండా ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొని పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. హథ్నూర మండలం పల్పనూరు గ్రామంలో పోచమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు..

## ఘనంగా కృష్ణగౌడ్ జన్మదిన వేడుకలు

కొల్చారం,ఏప్రిల్29హిందూస్థాన్ మీడియా



కొల్చారం మండలం ఎనగండ్ల గ్రామానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ నాయకుడు బిక్కునూరి కృష్ణగౌడ్ జన్మదిన వేడుకల్లో బుధవారం నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి పాల్గొన్నారు. అనంతరం కృష్ణగౌడ్ కు ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి ప్రత్యేక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆమె మాట్లాడుతూ...నిండు నూరేళ్లు సుఖసంతోషాలతో వర్ధిల్లాలని, ఆయురారోగ్యాలతో కుటుంబ సభ్యులతో కలిసి నిండు నూరేళ్లు సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో నరేష్ గౌడ్, బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు,తదితరులు పాల్గొన్నారు.

## అర్హులైన జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డులు జారీ చేస్తాం

**-కలెక్టర్ నారాయణరెడ్డి**



రంగారెడ్డి జిల్లా ,ఏప్రిల్ 29 హిందూస్థాన్ మీడియా

నూతన మీడియా అక్రిడిటేషన్ కమిటీ సభ్యులతో జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి సమావేశమయ్యారు. బుధవారం నూతన మీడియా అక్రిడిటేషన్ కమిటీ సభ్యులతో జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన డిస్ట్రిక్ట్ మీడియా అక్రిడిటేషన్ కమిటీ సభ్యులకు జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ...అర్హులైన వారికి అక్రిడిటేషన్ కార్డులు జారీ చేయాలని,252 జీఓకు అనుగుణంగా నియమ, నిబంధనలు పాటించాలని సూచించారు.మీడియా ప్రతినిధులు ప్రజలకు ప్రభుత్వ పథకాలు,అభివృద్ధి కార్యక్రమాల సమాచారం చేరవేయడంలో కీలక పాత్ర పోషిస్తారని పేర్కొన్నారు.అక్రిడిటేషన్ ప్రక్రియ సజావుగా జరిగేలా చూడాలని నియమ నిబంధనలు పాటించాలని,ఎప్పటికప్పుడు కమిటీ సభ్యులతో అన్ని విషయాలు చర్చించి ముందుకు వెళ్లాలని సూచించారు. అనంతరం కమిటీ సభ్యులు జిల్లా కలెక్టర్ కు శాలువా కప్పి పుష్పగుచ్ఛంతో ఘనంగా సన్మానించారు.సమావేశంలో డీపీఆర్ఓ బాలేశ్వరి, డిస్ట్రిక్ట్ మీడియా అక్రిడిటేషన్ కమిటీ సభ్యులు కె.శ్రీకాంత్ రెడ్డి,శేఖర్ ఉప్పరి,సయ్యద్ ఇక్రముల్లా హుస్సైని,అన్నవరపు శేఖర్ బాబు,మహ్మద్ సిరాజ్, గంజి ప్రదీప్ కుమార్, సిహెచ్.రాంరెడ్డి,ఎం. శ్రీనివాస్, యు. శివకుమార్, రొయ్యల రాజు,ఏఈఐఈ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా కిక్‌బాక్సింగ్ పోటీల్లో బిఎంఆర్ అకాడమీ విద్యార్థుల సత్తా




మందమర్రి,ఏప్రిల్ 29హిందూస్థాన్ మీడియా

మంచిర్యాల జిల్లా మాదారం టౌన్షిప్ సింగరేణి ఫంక్షన్ హాల్‌లో జిల్లా కిక్‌బాక్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి కిక్‌బాక్సింగ్ పోటీల్లో మందమర్రికి చెందిన బిఎంఆర్ కిక్‌బాక్సింగ్ అకాడమీ విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబర్చారు. పోటీల్లో పాల్గొన్న పలువురు క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికఉయ్యారు. సబ్ జూనియర్స్ పాయింట్ ఫైవ్ విభాగంలో బాలుర కేటగిరీలో రామ్ చరణ్ (26 కేజీలు),దేవాన్ష్ (20 కేజీలు),విరాట్ ధ్రువాన్ (30 కేజీలు) రాష్ట్రస్థాయికి అర్హత సాధించారు.బాలికల విభాగంలో వినూత్న (28 కేజీలు),సంయుక్త (47 కేజీలు)ప్రతిభ కనబర్చగా, మ్యూజికల్ ఫామ్ విభాగంలో సోహణిశ్రీ కూడా రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఎంపికైన క్రీడాకారులు మే 9,10 తేదీల్లో రంగారెడ్డి జిల్లాలో జరగనున్న రాష్ట్రస్థాయి కిక్‌బాక్సింగ్ పోటీల్లో పాల్గొననున్నారు.ఈ సందర్భంగా క్రీడాకారులను జిల్లా కిక్‌బాక్సింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు సుదమల్ల హరికృష్ణ,కార్యదర్శి మారుపాక శ్రీలత, మాస్టర్ కర్ర వెంకటేష్,జిల్లా కోచ్ వినయ్ అభినందించారు.

## వరి ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు



శివంపేట,ఏప్రిల్ 29 హిందూస్థాన్ మీడియా

శివంపేట మండలంలోని గోమారం గ్రామంలో రామేశ్వరం చండి రైతు ఉత్పత్తిదారుల సంఘం గోమారం వడ్ల కొనుగోలు కేంద్రాన్ని గోమారం సర్పంచ్ కుమ్మరి హైమావతి-ఆంజనేయులు ప్రారంభించడం జరిగింది.రాష్ట్ర ప్రభుత్వం వడ్లు కొనుగోలు గ్రేట్ ఏ రకాని 2389,సాధారణ రకం 2369 రూపాయలు నిర్ణయించడం జరిగింది.రైతు సంఘాలు ఏర్పాటు చేసినటువంటి సెంటర్లకే విక్రయించాలీ.ఈ కార్యక్రమానికి మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ పెద్దపట్లూరు మాధవరెడ్డి,రైతు సంఘం అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి,మాజీ ఎంపిటిసి డి.నరసింహారెడ్డి,ఉప సర్పంచ్ శ్రీధర్ రెడ్డి,వేణుగోపాల్ రెడ్డి,నాగరాజు యాదవ్,నర్సారెడ్డి,రాజేందర్,అనిల్ పాల్గొనడం జరిగింది.అనంతరం లచ్చిరెడ్డిగూడెం మరియు నవాపేట్ గ్రామాలలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభించడం జరిగింది.

# మేడే ను జయప్రదం చేయండి

**-సిపిఎం పార్టీ కొమరవెల్లి మండల కార్యదర్శి తాడూరు రవీందర్**

కొమురవెల్లి (ఏప్రిల్ 29 హిందూస్థాన్ మీడియా)


ప్రపంచ కార్మిక దినోత్సవం మేడే ను కొమురవెల్లి మండలం లోని అన్ని గ్రామాలలో ఎర్రజెండాలు ఎగరవేసి జయప్రదం చేయాలని గ్రామాలలో కార్మికుల, ప్రజల హక్కులు ప్రతిబింబించేలా ప్రదర్శనలు సభలు నిర్వహించాలని సిపిఎం పార్టీ కొమురవెల్లి మండల కార్యదర్శి తాడూరు రవీందర్ కార్మికులు, రైతులు, కూలీలు, శ్రామిక ప్రజలకు పిలుపునిచ్చారు. బుధవారం రోజున మండలంలోని తపస్పల్లి గ్రామంలో హమాలీ కార్మికులతో మాట్లాడుతూ 1886 మే 1వ తేదీన అమెరికాలోని చికాగో నగరం హే మార్కెట్లో ఎనిమిది గంటల పని దినం, కనీస వేతనాలు అమలు, కార్మిక సంఘాలను హక్కుల కోసం నిర్మాణం, చేసుకునే హక్కుల కోసం ప్రపంచ కార్మికులంతా ఏకమై పోరాడి ప్రాణ త్యాగాలు చేసి హక్కులు సాధించుకున్న రోజు ప్రపంచ కార్మిక దినోత్సవం మేడే అని అన్నారు. చికాగో అమరుల పోరాట స్ఫూర్తితో గ్రామ గ్రామాన అడ్డాల వద్ద కంపెనీల వద్ద పని ప్రదేశాల వద్ద సిఐటియూ జెండాలు ఎర్రజెండాలు ఎగరవేయాలని వారు పిలుపునిచ్చారు. బిజెపి నాయకత్వంలోని నేటి కేంద్ర ప్రభుత్వం భారత కార్మిక వర్గాన్ని అణిచివేసి మేడే నాటి పూర్వపు దుర్మార్గపు రోజుల్లోకి తీసుకుపోయేందుకు తీవ్రంగా కేంద్ర ప్రభుత్వం ప్రయత్నం చేస్తుందన్నారు. దశాబ్ద కాలం పాటు పోరాటాలు త్యాగాలతో కార్మిక వర్గం సాధించుకున్న 29 రకాల చట్టాలను రద్దుచేసి



నాలుగు లేబర్ కోడ్ లుగా రూపొందించిందన్నారు. కార్మిక హక్కులను హరించి వేస్తూ ఎనిమిది గంటల పని దినం స్థానంలో 12 నుంచి 16 గంటలు పనిచేసే విధంగా, కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయకుండా పెట్టుబడిదారులకు అనుకూలంగా కార్మిక సంఘాలను పెట్టుకునే హక్కు, సమ్మె చేసే హక్కు లేకుండా కార్మిక చట్టాలను రద్దు చేసిందన్నారు. ప్రజా వ్యతిరేక చట్టాలను చేస్తూ ప్రభుత్వరంగాన్ని ధ్వంసం చేసి ప్రైవేటుపరం చేయడానికి కార్పొరేట్ శక్తులకు తలుపులు బార్ల తెరిచారని ఈ విధానాల వలన అన్ని వర్గాల ప్రజలపై భారాలు పడుతున్నాయని కార్మికుల మధ్య ఐక్యతను దెబ్బతీసే విధంగా మతోన్మాదాన్ని ముందుకు తీసుకు వస్తుందని ఈ విధానాలకు వ్యతిరేకంగా ప్రపంచ కార్మిక దినోత్సవం మేడే స్ఫూర్తితో కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం రాజ్యాంగ పరిరక్షణ కోసం భారత రాజ్యాంగం ద్వారా పొందిన ప్రాథమిక హక్కులను నిలుపుకోవాలన్న లక్ష్యంతో కార్మిక వర్గం మరింత పట్టుదలతో పోరాడుతూ మేడే అమరుల స్ఫూర్తితో ఐక్య పోరాటాలు ఉధృతం చేయాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు పాకనాటి బాలు హమాలీ కార్మికులు మల్కని కనకయ్య, కంకణాల నర్సింలు, పుట్ట యాదయ్య, చిన్నోల కనకయ్య, రాజేశం, కనకయ్య, ఈగ గోపాల్, ఈగ స్వామి, చిన్నోల కిష్టయ్య, కంకణాల కనకయ్య, పుట్ట పరిషి, ఓర్రోల నర్సింలు, రూద్రరపు కనకయ్య, రుద్రరపు నర్సింలు, రుద్రరపు కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

# 10వ తరగతి ఫలితాల్లో సెయింట్ విన్సెంట్ ప్రభంజనం



**-రికార్డు స్థాయి విజయంతో మెరిసిన విద్యార్థులు**

సిద్దిపేట జిల్లా, (ఏప్రిల్ 29 హిందూస్థాన్ మీడియా)

10వ తరగతి ఫలితాల్లో రేగులపల్లి గ్రామ పరిధిలోని సెయింట్ విన్సెంట్ పల్లోటి పాఠశాల అద్భుత ప్రతిభతో అందరి దృష్టిని ఆకర్షించింది. ఈ విద్యాసంవత్సరంలో పాఠశాల విద్యార్థులు సాధించిన ఫలితాలు మండలంలోనే కాకుండా జిల్లా స్థాయిలో కూడా ప్రత్యేక గుర్తింపును తెచ్చాయి. మొత్తం 44 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా, అందులో 43 మంది 500కు పైగా మార్కులు సాధించడం విశేషం. ఈ ఫలితాలు పాఠశాల విద్యా ప్రమాణాలను స్పష్టంగా ప్రతిబింబిస్తున్నాయి. ముఖ్యంగా వైష్ణవి 577 మార్కులు సాధించి మండలంలో ప్రథమ స్థానం దక్కించుకోవడం ఈ విజయానికి తలపాగా లాంటిది. ఇతర ప్రతిభావంతులలో నౌమిత 575 మార్కులు, మణిచందన 573 మార్కులు, రోహిత్ మరియు సహస్రలు తలో 572 మార్కులు, రుద్రంబికా 570 మార్కులు సాధించి అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. ప్రతి విద్యార్థి కష్టపడి సాధించిన ఈ ఫలితాలు పాఠశాల స్థాయిని మరింత ఎత్తుకు తీసుకెళ్లాయి. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ సిస్టర్ ఫ్యూలా ఆనందం వ్యక్తం చేస్తూ, విద్యార్థుల కృషి, పట్టుదల, ఉపాధ్యాయుల మార్గదర్శకత్వం వల్లే ఈ విజయం సాధ్యమైందని తెలిపారు. తల్లిదండ్రుల సహకారం కూడా ఈ విజయానికి కీలకమని ఆమె పేర్కొన్నారు. మొత్తంగా చూస్తే, సెయింట్ విన్సెంట్ పల్లోటి పాఠశాల ఈ ఫలితాలతో విద్యారంగంలో తన ప్రత్యేక స్థానం మరోసారి నిరూపించుకుంది.

# బాలకార్మిక వ్యవస్థను రూపు మాపుదాం





**-బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన సామాజిక బాధ్యత..**
**-హోటళ్,లాడ్జలలో ప్రత్యేక తనిఖీలు..**
**-రాజేంద్రనగర్ సర్కిల్ ప్రాజెక్ట్ అధికారి స్వాతి**

రాజేంద్రనగర్, ఏప్రిల్ 29హిందూస్థాన్ మీడియా

బాలకార్మిక వ్యవస్థను రూపు మాపేందుకు ప్రతిఒక్కరూ కృషిచేయాలని రాజేంద్రనగర్ సర్కిల్ ప్రాజెక్ట్ అధికారి స్వాతి తెలిపారు. ప్రజాపాలన--ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా బుధవారం డీపీఓ స్వాతి, చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ సంతోష,ఎస్ఐ రాజ్‌కుమార్, సీఓ లక్ష్మణ్, సిబ్బంది సంయుక్తంగా ఆరాంఘర్ లోని పిస్తా హౌస్ హోటల్, లాడ్జలలో ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు.ఈ తనిఖీల సందర్భంగా హోటల్ సిబ్బంది ఆధార్ కార్డులను వారి వివరాలను పరిశీలించారు. బాల కార్మిక వ్యవస్థ, చిన్నారుల అక్రమరవాణా, బాలలపై వేధింపుల నివారణపై హోటల్ యాజమాన్యాలకు అవగాహన కల్పించారు.చిన్నారుల రక్షణకు సంబంధించిన నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, అనుమానాస్పద ఘటనలు గమనించిన వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ప్రతి ఒక్కరి జీవితంలో బాల్యం అమూల్యమైనదన్నారు. బాల్యాన్ని అనుభవించడం ప్రతి పౌరుని హక్కుఅని,



క్షణికావేశంలో పిల్లల తొందరపాటుతో చిన్నచిన్న విషయాలకే తల్లిదండ్రులను విడిచి ఇంటికి దూరంగా ఉంటున్నారన్నారు. ఇట్టి అవకాశాన్ని ఆసరాగా తీసుకొని కొందరు వారిచే పనులు చేయిస్తూ వారి జీవితాలతో ఆడుకుంటున్నారన్నారు. చిన్నారుల భద్రత, సంక్షేమం కోసం ఇటువంటి తనిఖీలు, అవగాహన కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతాయని తెలిపారు. హోటల్స్ లలో బాల కార్మికులను నియమించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు.

# గ్రామాల అభివృద్ధిలో పంచాయతీ కార్యదర్శులు క్రియాశీలక పాత్ర







**-నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్**

నాగర్ కర్నూల్ ఏప్రిల్ 29హిందూస్థాన్ మీడియా

గ్రామాల సమగ్రాభివృద్ధిలో పంచాయతీ కార్యదర్శులు కీలక పాత్ర పోషించాలని నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ అన్నారు. బుధవారం జిల్లా కలెక్టరేట్‌లోని ప్రధాన సమావేశ మందిరంలో జిల్లాలోని 460 గ్రామపంచాయతీల కార్యదర్శులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా సమావేశంలో జిల్లా పరిషత్ సీఈఓ దేవ సహాయం, జిల్లా పంచాయతీ అధికారి శ్రీరాములు, డిఆర్డిఏ ప్రాజెక్టు డైరెక్టర్ చిన్న ఓబులేష్ తదితరులు పాల్గొన్నారు. జిల్లాలో గ్రామీణ అభివృద్ధి కార్యక్రమాల పురోగతిపై అధికారులు తో విస్తృతంగా చర్చించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ...., పల్లెల సర్వతోముఖాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, గ్రామీణ జీవన ప్రమాణాలను మెరుగుపరచడం లక్ష్యంగా పలు సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తున్నదని, ఈ నేపథ్యంలో పంచాయతీ కార్యదర్శులు తమ బాధ్యతలను సమర్థంగా నిర్వర్తిస్తూ, గ్రామ సర్పంచులు మరియు స్థానిక ప్రజాప్రతినిధులతో సమన్వయంతో పనిచేయాలని సూచించారు. గ్రామాల్లో పారిశుద్ధ్యం, తాగునీరు, మౌలిక వసతులు, హరితహారం, నిధుల వినియోగం వంటి అంశాల్లో ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ,ప్రభుత్వం రూపొందించిన మార్గదర్శకాల ప్రకారం మాత్రమే పనులు చేపట్టాలని, నిధుల వినియోగంలో పారదర్శకత పాటించాలని స్పష్టం చేశారు. తాను త్వరలోనే క్షేత్రస్థాయి పర్యటనలు చేపట్టి గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలిస్తానని, పంచాయతీ కార్యదర్శుల పనితీరును నేరుగా అంచనా వేస్తానని, ప్రజలకు అందిస్తున్న సేవలపై ప్రత్యేకంగా దృష్టి సారిస్తానని పేర్కొన్నారు. ప్రభుత్వ ఉద్యోగులుగా ప్రజలకు జవాబుదారీతనంతో పనిచేయడం అత్యవసరమని, ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కరించడంలో చురుకుగా ఉండాలని సూచించారు. ప్రజల నమ్మకం సంపాదించాలంటే సేవాభావంతో పనిచేయాలని, అప్పుడు మాత్రమే మంచి గుర్తింపు లభిస్తుందని, పంచాయతీ కార్యదర్శులు తమ స్వంత జిల్లాల్లోనే సేవలు అందించడం ఒక ప్రత్యేక అవకాశం అని పేర్కొంటూ, తమ ప్రాంత అభివృద్ధికి మరింత కృషి చేయాలని సూచించారు. స్థానిక సమస్యలపై అవగాహనతో త్వరితగతిన స్పందించి, గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని, అధికారులు లేదా ప్రజలు ఫోన్ ద్వారా సంప్రదించినప్పుడు వెంటనే స్పందించి సరైన సమాచారం ఇవ్వాలని, ఎక్కువ సమయం తమ తమ పంచాయతీ పరిధిలోనే గడుపుతూ ప్రజలకు చేరువ కావాలని కలెక్టర్ ఆదేశించారు. గ్రామాల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాలు, కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాలను (కేజీబీవీలు) అధికారులు తరచుగా సందర్శించాలని, విద్యార్థులకు అందిస్తున్న విద్యా సదుపాయాలు, వసతి, తాగునీరు, పారిశుద్ధ్యం, ఆరోగ్య పరిరక్షణ చర్యలను సమగ్రంగా పరిశీలించాలని కలెక్టర్ సూచించారు. అలాగే విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం మరియు వసతి గృహాల్లో అందించే ఆహారం నాణ్యత, పరిశుభ్రత, పోషక విలువలను ప్రత్యేకంగా తనిఖీ చేయాలని ఆదేశించారు. విద్యార్థులు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా అన్ని మౌలిక వసతులు సక్రమంగా అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పేర్కొన్నారు. గ్రామ పరిధిలో వచ్చే ప్రజా ఫిర్యాదులను సాధ్యమైనంత వరకు గ్రామస్థాయిలోనే త్వరితగతిన పరిష్కరించాలని అధికారులకు సూచించారు. స్థానికంగా పరిష్కరించగల సమస్యలను ఆలస్యం చేయకుండా వెంటనే చర్యలు తీసుకుని ప్రజలకు ఉపశమనం కల్పించాలని, మీ పరిధిలో లేని అంశాలను సంబంధిత ఉన్నతాధికారుల దృష్టికి వెంటనే తీసుకువెళ్లి, సమస్యల పరిష్కారానికి సమన్వయంతో కృషి చేయాలని ఆదేశించారు. ప్రజల సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం ప్రదర్శించకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కలెక్టర్ సూచించారు.

# నిప్పుల కొలిమిగా మారనున్న మే-జూన్ నెలలు

**-భానుడి దెబ్బకు కేంద్రం హై అలెర్ట్**
**-భారత వాతావరణ శాఖ హెచ్చరికలతో అప్రమత్తం**

ఏప్రిల్ 29 హిందూస్థాన్ మీడియా

మునుపెన్నడూ లేని విధంగా ఈ వేసవిలో సూర్యుడు నిప్పుల వర్షం కురిపిస్తుండడంతో ఎండలు భీభత్సంగా మండిపోతున్నాయి.ఇప్పటికే ప్రజలు ఎండుటాకుల్లా మాడిపోతున్నారు.ఇప్పుడు భారత వాతావరణ శాఖ మరో పిడుగులాంటి వార్తను వెల్లడించింది. గతంలో ఎన్నడూ లేనంత తీవ్రంగా రాబోయే మే, జూన్ నెలలు ప్రచండ భానుడి భగభగలు ఉండబోతున్నాయని హెచ్చరించింది.భారత వాతావరణ శాఖ హెచ్చరికలతో కేంద్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. ఏప్రిల్ చివరి నుండి జూన్ వరకు దేశంలోని పలు రాష్ట్రాల్లో సాధారణం కంటే అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉన్నందున ప్రజారోగ్య పరిరక్షణకు తక్షణ చర్యలు తీసుకోవాలని అన్ని రాష్ట్రాలు,కేంద్రపాలిత ప్రాంతాలను కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ ఆదేశించింది.కేంద్ర ఆరోగ్య కార్యదర్శి పుణ్య సలీల శ్రీవాస్తవ అన్ని రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులకు పంపిన లేఖలో చేపట్టాల్సిన సన్నద్ధతా చర్యలను నొక్కి చెప్పారు. ప్రత్యేక హీట్-స్ట్రోక్ యూనిట్లు అన్ని ఆరోగ్య కేంద్రాల్లో వడదెబ్బ బాధితుల కోసం ప్రత్యేక నిర్వహణ విభాగాలను ఏర్పాటు చేయాలని,రియల్ టైమ్ రిపోర్టింగ్ గా వడదెబ్బ కేసులను సమీకృత ఆరోగ్య సమాచార వేదికలో ఎప్పటికప్పుడు నమోదు చేయాలని, అత్యవసర సమయాల్లో బాధితులను వేగంగా ఆసుపత్రికి తరలించేలా అంబులెన్స్ సేవలను సిద్ధంగా ఉంచాలని, వాతావరణ మార్పులపై ప్రజలను నిరంతరం అప్రమత్తం చేస్తూ ముందస్తు హెచ్చరికలను జారీ చేయాలని ముందస్తు హెచ్చరికలు జారీ చేసింది. ఎక్కడ ఎక్కువగా వడగాల్పుల ప్రభావం ఉంటుంది? ఈ ఏడాది తూర్పు-మధ్య భారతంలో ఒడిశా,పశ్చిమ బెంగాల్, వాయువ్య భారతం, ఉత్తర భారతదేశంలోని మైదాన ప్రాంతాలు,తీర ప్రాంతాలైన ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, పుదుచ్చేరి తీరాల్లో వడగాల్పుల ప్రభావం గణనీయంగా ఉండనుందని, పశ్చిమ భారతంలోని గుజరాత్, మహారాష్ట్ర మరియు కర్ణాటకలోని కొన్ని ప్రాంతాలు ప్రభావితం కానున్నాయని ఐఎమ్‌డి అంచనా వేస్తుంది. సున్నా మరణాలే ప్రభుత్వ లక్ష్యం తీవ్రమైన వేడిమి వల్ల సంభవించే అనారోగ్యాలను తగ్గించడం, మరణాలను పూర్తిగా అరికట్టడమే లక్ష్యంగా కేంద్రం ఈ ప్రణాళికను సిద్ధం చేసింది. సమన్వయ యంత్రాంగాలను బలోపేతం చేసి, క్షేత్రస్థాయిలో మార్గదర్శకాలను పక్కాగా అమలు చేయాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు వెళ్లాయి.వేసవి తీవ్రత సన్నద్ధతా వ్యవస్థలను ఎప్పటికప్పుడు సమీక్షించుకోవాలని,ప్రజలు కూడా మధ్యాహ్న సమయాల్లో అప్రమత్తంగా ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు.




# ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం

**-క్యాంప్ కార్యాలయంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి**
**-ఉన్నతాధికారులతో సమీక్ష**
**-తుమ్మిడిహట్టి నుంచి ఎల్లంపల్లికి నీటి తరలింపు పై నాలుగు ప్రతిపాదనలు**

ఏప్రిల్ 29 హిందూస్థాన్ మీడియా

ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు నిర్మాణానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. తుమ్మిడిహట్టి నుంచి ఎల్లంపల్లికి నీటి తరలింపుపై నాలుగు ప్రతిపాదనలు పరిశీలనలో ఉన్నాయి. ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు నిర్మాణానికి కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం కట్టుబడి ఉందని మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీకి కట్టుబడి ప్రాజెక్టు నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు రాష్ట్ర ఇరిగేషన్ శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ రోజు సాయంత్రం సీఎం రేవంత్ రెడ్డితో జరుగనున్న సమావేశంలో తుమ్మడిహట్టిపై నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు. తుమ్మడి హట్టి నుంచి ఎల్లంపల్లికి నీటిని తరలించి లక్షలాది ఎకరాలకు నీరందించేందుకు భగీరథ ప్రయత్నం చేస్తున్నామని, ప్రత్యామ్నయా మార్గాలను పరిశీలిస్తున్నామని తెలిపారు. బుధవారం ఉదయం కుందన్ బాగ్ లోని ఆయన క్యాంప్ కార్యాలయంలో తుమ్మిడిహాట్టి నుండి ఎల్లంపల్లికి ప్రత్యామ్నాయ మార్గాలతో పాటు మెడిగడ్డ,సుందిళ్ల, అన్నారం పునరుద్ధరణ పనులపై మంత్రి ఉత్తమ్ ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల మరమ్మతులకు పరీక్షలు నిర్వహిస్తున్నామని, సీఎంతో జరిగే సమావేశంలో దీనిపై చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు. తుమ్మిడిహట్టి నుండి ఎల్లంపల్లికీ నీటిని తరలించేందుకు గాను ప్రత్యామ్నాయ మార్గాలపై అధ్యయనం చేయాలని ఆర్వీ అసోసియేట్స్, ఐఐటీ హైదరాబాద్ కు బాధ్యత అప్పగించామని ఉత్తమ్ తెలిపారు. వారు నాలుగు ప్రతిపాదనలను ప్రభుత్వం ముందు ఉంచారని ఆయన వెల్లడించారు. ప్రభుత్వం ముందుకు వచ్చిన నాలుగు ప్రతిపాదనలపై ప్రభుత్వం లోతుగా పరిశీలిస్తున్నామని తెలిపారు. ప్రతీ ప్రతిపాదనకు అయ్యే ఖర్చు అనుకూల, ప్రతికూల పరిస్థితిలపై అధ్యయనం చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు. ఈ రోజు సాయంత్రం ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి తో జరగనున్న ప్రత్యేక సమీక్షా సమావేశంలో ఆ నాలుగు ప్రతిపాదనలపై సమీక్షించి తగు నిర్ణయం తీసుకొనున్నట్లు ఆయన తెలిపారు. అదేవిధంగా మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారం పునరుద్ధరణకు అవసరమైన పరీక్షలన్నింటినీ వర్షాకాలం ప్రారంభం లోపు పూర్తి చేయాలని ఉత్తమ్ అధికారులను ఆదేశించారు. పరీక్షల నిర్వహణలో విధిగా నిబంధనలు పాటించాలని ఆయన సూచించారు. ప్రతీ 1.5 మీటర్ల దూరంలో ఎస్.పీ.టి పరీక్షలు నిర్వహించాలని ఆయన సూచించారు. అదే విదంగా ప్రతీ మూడు మీటర్ల దూరంలో పెర్మిబిలిటి టెస్ట్ లు జరపాలి అన్నారు. బోర్లు వేస్తున్న సమయంలో రాయి వచ్చినా ఐదు మీటర్ల లోతుగా బోర్లు వేయాలన్నారు.బ్యారేజ్ ల పునరుద్ధరణ కోసం నియమించిన సమన్వయ కమిటి బ్యారేజ్ లను సందర్శించిన టైంలైన్ ను నిర్దేశించు కోవాలని ఆయన అధికారులకు చెప్పారు.సీడబ్ల్యూపీఆర్ఎస్ డైరెక్టర్ క్షేత్రస్థాయిలో ఉంటూ పునరుద్ధరణకు అవసరమైన పనులు త్వరితగతిన పూర్తి అయ్యేలా చూడాలన్నారు. అదే సమయంలో పునరుద్ధరణ కోసం జరుగుతున్న పరీక్షల పురోగతి పనుల వివరాలు ఎప్పటికప్పుడు ఎన్డీఎస్ఏకు నివేదించాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి నీటిపారుదల శాఖా కార్యదర్శిని ఆదేశించారు. ఈ సమావేశంలో నీటిపారుదల శాఖా ప్రధాన కార్యదర్శి ఇ. శ్రీధర్, సహాయ కార్యదర్శి కే. శ్రీనివాస్, ఈఎన్సీ రమేష్ బాబు, జయశంకర్ భూపాలపల్లి కలెక్టర్ రోహిత్ శర్మ, ఆర్వీ అసోసియేట్స్, ఐఐటీ హైదరాబాద్ ప్రతినిధులు ఈ సమావేశంలో పాల్గొన్నారు



## రైతులు కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి

**-నిర్వాహకులు త్వరితగతిన కొనుగోళ్ళు పూర్తి చేయాలి**
**-జగిత్యాల కలెక్టర్ బి. సత్యప్రసాద్**



జగిత్యాల జిల్లా ఏప్రిల్ 29 హిందూస్థాన్ మీడియా

జగిత్యాల రూరల్ మండలం లోని చల్ గల్, తాటిపెల్లి గ్రామాల్లో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆకస్మికంగా జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ తనిఖీ చేశారు. రైతులకు ఇబ్బందులు లేకుండా పారదర్శకంగా,వేగంగా కొనుగోలు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం స్వీకరణ పరిస్థితిని ,తూకం విధానాన్ని ,17 శాతం తేమ శాతం నిర్వహణను మరియు కేంద్రల వద్ద వసతులను పరిశీలించారు. కొనుగోలు కేంద్రాలకు వచ్చే వరి ధాన్యంపై ప్రభుత్వ నిబంధనల మేరకు తేమశాతం తప్పనిసరిగా పరిశీలించి, నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా కొనుగోళ్ళు చేయాలని,కొనుగోలు చేసిన ధాన్యాన్ని వాహనాల ద్వారా తక్షణమే రైస్ మిల్లులకు తరలించే విధంగా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. క్లస్టర్ అధికారులకు కేటాయించిన కొనుగోలు కేంద్రాల్లో రైతులకు అవసరమైన బరువు యంత్రాల నిర్వహణ, త్రాగునీరు, షేడ్ నెట్ ల ఏర్పాటు, ధాన్యం కొనుగోళ్ళు వంటి అంశాలను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. అలాగే వాతావరణం మార్పుల దృష్ట్యా టార్పలిన్ కవర్ లు అందుబాటులో ఉంచుకోవాలని అన్నారు. ఈ పరిశీలనలో జగిత్యాల ఆర్డీవో మధుసూదన్, డిఆర్డిఓ రఘువరన్, ఎమ్మార్వో, ఎంపీడీవో, సంబంధిత అధికారులు మరియు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థినికి 20 వేలు ఆర్థిక సాయం



ఉమ్మడి ఖమ్మం జిల్లా ఏప్రిల్ 29హిందూస్థాన్ మీడియా

వైరా లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో బీటెక్ చదువుతున్న నిరుపేద విద్యార్థిని కి రూ 20.000 లను జిల్లా మార్కెట్ కోఆర్డినేటర్ లయన్ లగడపాటి ప్రభాకర్ రావు పుట్టినరోజు పురస్కరించుకుని వారి దాతృత్వంతో బుధవారం మున్సిపల్ కార్యాలయంలో ఫాస్ట్ జిల్లా గవర్నర్ డాక్టర్ మురళీకృష్ణ చేతుల మీదుగా అందించారు. ఈ సందర్భంగా మురళీకృష్ణ మాట్లాడుతూ వైరా లయన్స్ క్లబ్ ద్వారా అనేకమంది విద్యార్థిని విద్యార్థులకు చదువులు నిమిత్తం సహాయ సహకారాలు అందించామని పై చదువులు నిమిత్తం ఎంతోమందికి ఆర్థికంగా ఆదుకున్నామని తెలిపారు. విద్యార్థి విద్యార్థులు చదువులో రాణించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విజన్ కోఆర్డినేటర్ ఉంద్రు శ్యాంబాబు జోన్ చైర్మన్ చింతోజు నాగేశ్వరరావు రీజియన్ సెక్రటరీ పెనుగొండ ఉపేందర్ రావ్ వైరా లయన్స్ క్లబ్ అధ్యక్షులు వై బుచ్చి రామారావు సెక్రటరీ చెరుకూరి శ్రీనివాసరావు కోశాధికారి గద్దె నీరజ లయన్స్ క్లబ్ సభ్యులు ఏపూరి రాజారావు పులి కృష్ణార్జునరావ్ సుగ్గల మాధవి తిరుపతి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## వైరా గ్రేట్ విజన్ క్లబ్ ఆధ్వర్యంలో పేద విద్యార్థికి సైకిల్ వితరణ



ఉమ్మడి ఖమ్మం జిల్లా ఏప్రిల్ 29 హిందూస్థాన్ మీడియా

వైరా గ్రేట్ విజన్ క్లబ్ అధ్యక్షులు జాలా పుల్లారావు ఆధ్వర్యం లో డిస్ట్రిక్ట్ మార్కెటింగ్ కోఆర్డినేటర్ లయన్ లగడపాటి ప్రభాకరరావు పుట్టినరోజు సందర్భంగా వైరా కు చెందిన వేము సుమ శ్రీ కి సైకిల్ అందించారు. ఈ కార్యక్రమంలో పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ లయన్ డాక్టర్ కాపా మురళీకృష్ణ మాట్లాడుతూ పేద విద్యార్థులకు ఆదుకోవటంలో గ్రేట్ విజన్ క్లబ్ ముందు ఉంటుంది అని తెలిపారు. ఈ కార్యక్రమము లో విజన్ కోఆర్డినేటర్ ఉంద్రు శ్యామ్ బాబు వరలక్ష్మి చింతోజు నాగేశ్వరరావు తోటకూర శ్రీకాంత్ గంగవరపు కిషన్ ఉయ్యూరు రామకృష్ణ జాలా మహలక్ష్మి కె. గోపి తదితరులు పాల్గొన్నారు.

## 10వ తరగతిపరీక్షల్లో580 మార్కులతో సత్తా చాటిన మౌనిక

అందోల్,ఏప్రిల్ 29 హిందూస్థాన్ మీడియా



సంగారెడ్డి జిల్లా రాయికోడ్ మండలం కంజామల్పూర్ గ్రామానికి చెందిన స్వప్న,ఎల్లప్ప దంపతుల కూతురు పంపటి మౌనిక బాచేపల్లి నిజాంపేట్ తెలంగాణ గురుకుల పాఠశాలలో పంపటి మౌనిక 600 మార్కులకు 580మార్కులు సాధించి రాయికోడ్ మండలం పేరు జిల్లాలో రావటంతో ప్రజలు మౌనిక తల్లితండ్రులకు, ఉపాధ్యాయులకు ధన్యవాదాలు తెలిపారు.

## ప్రజలకు తాగునీటి సౌకర్యం ఏర్పాటు చేయడమే ప్రభుత్వ లక్ష్యం

-బెల్లంపల్లి మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కారుకూరి రామచందర్



బెల్లంపల్లి ఏప్రిల్ 29 హిందూస్థాన్ మీడియా

ప్రజలకు తాగునీటి సౌకర్యం ఏర్పాటు చేయడమే ప్రభుత్వ లక్ష్యమని బెల్లంపల్లి మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కారుకూరి రామచందర్ పేర్కొన్నారు.బుధవారం రోజున బెల్లంపల్లి మండలం సోమగూడెం గ్రామపంచాయతీలో బెల్లంపల్లి శాసన సభ్యులు గడ్డం వినోద్ ఆదేశాల మేరకు బెల్లంపల్లి మండలం సోమగూడెం గ్రామపంచాయతీ పరిధిలోని పలువార్డులలో నీటిఎద్దడి దృష్ట్యా నూతన బోర్‌వెల్ పనులను ఆయన ప్రారంభించారు.కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బెల్లంపల్లి మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్, బెల్లంపల్లి మాజీ జెడ్పీటీసీ కారుకూరి రాంచందర్ హాజరై బోర్‌వెల్ పనులను ప్రారంభించి మాట్లాడుతూ...గ్రామ ప్రజలకు తాగు నీటి సౌకర్యం మెరుగుపర్చే లక్ష్యంతో చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో సోమగూడెం సర్పంచ్ పొన్నాలమౌనిక, సోమగూడెం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గోమాస భీమయ్య,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ముత్తె భూమయ్య, పొన్నాల రాజు,తోట సురేష్,బెల్లంపల్లి బుగ్గ రాజేశ్వర స్వామి దేవస్థానం డైరెక్టర్ దూడం మహేష్,యూత్ కాంగ్రెస్ బెల్లంపల్లి మండల అధ్యక్షుడు సోమగూడెం 10వ వార్డ్ సభ్యుడు బామల్ల రాకేష్ పాల్గొన్నారు.

## సికింద్లాపూర్‌లో బాల పంచాయతీ కార్యక్రమం

-పిల్లల్లో నాయకత్వ లక్షణాల పెంపు..



శివంపేట,ఏప్రిల్ 29 హిందూస్థాన్ మీడియా

తెలంగాణ పోలీస్ శాఖలోని సిఐడి తెలంగాణ విభాగం ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా బాల పంచాయతీ కార్యక్రమాలు నిర్వహిస్తున్న నేపథ్యంలో,మెదక్ జిల్లాలోని సికింద్లాపూర్ గ్రామాన్ని పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి బుధవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమం ద్వారా చిన్నారుల్లో చిన్న వయసు నుంచే నాయకత్వ లక్షణాలను పెంపొందించడం, బాల్య వివాహాలను తగ్గించడం,అలాగే చైల్డ్ అబ్యూస్ వంటి సమస్యలపై అవగాహన కల్పించడం లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇందులో భాగంగా యంగిస్తాన్ ఫౌండేషన్ వాలంటీర్లు గ్రామానికి వచ్చి సుమారు 15మంది పిల్లలను ఎంపిక చేసి బాల పంచాయతీ కార్యక్రమాన్ని నిర్వహించారు. వారికి ప్రత్యేక శిక్షణ కూడా అందించారు. ఈ కార్యక్రమంలో యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ ఇన్స్పెక్టర్ రాజశేఖర్ రెడ్డి, తూప్రాన్ ఇన్స్పెక్టర్ రంగాకృష్ణ, శివంపేట ఎస్సై మధుకర్ రెడ్డి పాల్గొని పిల్లలకు మార్గనిర్దేశం చేశారు. అదేవిధంగా గ్రామ సర్పంచ్, ఉపసర్పంచ్, పాలకవర్గ సభ్యులు, ఎంపీడీవో,ఐసిడిఎస్ సూపర్వైజర్,ఎంపీవో,స్కూల్ హెడ్మాస్టర్ మరియు ఇతర అధికారులు,గ్రామ పెద్దలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## సర్పంచ్ హేమలత బాలాజీ చేయూతతో వధువుకు రూ.5వేలు సహాయం

-పోలంపల్లి తండాలో ఆదర్శ కార్యక్రమం



కారేపల్లి,ఏప్రిల్ 29హిందూస్థాన్ మీడియా

పోలంపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని పోలంపల్లి తండాకు చెందిన బానోత్ భీముడు నెలరోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందగా,ఆయన కుమార్తె బానోతు ఈశ్వరి బాయి వివాహం బుధవారం జరగనుంది.ఈ నేపథ్యంలో స్పందించిన పోలంపల్లి సర్పంచ్,దిశా కమిటీ సభ్యురాలు ధారావతు హేమలత బాలాజీ 'చెల్లెమ్మలకు చేయూత'పథకం క్రింద వధువుకు రూ.5వేల నగదు ఆర్థిక సహాయాన్ని అందజేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ హేమలత బాలాజీ మాట్లాడుతూ...నిరుపేద కుటుంబాల అమ్మాయిల వివాహాలకు చేయూతనివ్వడం తన బాధ్యతగా భావిస్తున్నామని తెలిపారు.ప్రభుత్వం అమలు చేస్తున్న కళ్యాణలక్ష్మి పథకానికి తోడ్పాటుగా గ్రామస్థాయిలోనూ సహాయ కార్యక్రమాలు కొనసాగిస్తామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ గుగులోత్ సర్వన్,మాజీ సర్పంచ్ ధారావత్ బద్రునాయక్,వార్డ్ సభ్యులు లావుడియా రమేష్, అజ్మీరా సంపత్,బానోత్ లావణ్య,లక్ష్మణ్,గ్రామ పెద్దలు ధారావత్ బదియా,లాలు మోహన్ సింగ్, గుగులోత్ జగ్గయ్య, లక్ష్మణ్, దేవా, భద్రుతావూరియా, కిషన్, బాల, ధోని, వినాయక్,లాల్ సింగ్ ఠాగూర్, జిలేబి తదితరులు హాజరయ్యారు.

# వ్యవసాయ శాఖ ఆన్లైన్ పోర్టల్ పేర్లు నమోదు ఉన్న

-మార్క్ ఫెడ్ పోర్టల్ లో పేర్లు కనిపించడం లేదని
-రైతులు నుంచి మొక్కజొన్న కొనుగోలు తిరస్కరించిన సిబ్బంది ..
-మా పంట కొనుగోలు చేయాలని మండల వ్యవసాయ అధికారి కి రైతులు వినతి..
-కౌలు రైతుల నుంచి పంట కొనుగోలు చేయాలి..
-పామాయిల్ లో అంతర పంట మొక్కజొన్న సాగు చేసిన..
-రైతులు నుంచి మొక్కజొన్న కొనుగోలు చేయాలి ..
-రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు

ఉమ్మడి ఖమ్మం జిల్లా ఏప్రిల్ 29 హిందూస్థాన్ మీడియా

వైరా మండలం అష్ణగుర్తి గొల్లెన్ పాడ్ గ్రామాల్లో రైతులు రబీ సీజన్లో మొక్కజొన్న సాగు చేసి వ్యవసాయ శాఖ ఆన్లైన్ పోర్టల్ నమోదు లో కూడా మొక్కజొన్న సాగు చేసినట్లు సమాచారం చూపిస్తుంది. మొక్కజొన్న కొనుగోలు చేస్తున్న మార్క్ ఫెడ్ పోర్టల్ లో వ్యవసాయ శాఖ ఆన్లైన్ పోర్టల్ లో పేర్లు కనిపించడం లేదని ఆ రైతులు నుంచి మొక్కజొన్న కొనుగోలు చేయడం లేదు, మా పంట వ్యవసాయ శాఖ ఆన్లైన్ పోర్టల్ జాబితా ప్రకారం కొనుగోలు చేయాలని రైతులు వైరా మండల వ్యవసాయ శాఖ అధికారి ముంజఖాన్ కి వినతి పత్రం సమర్పించారు.



ఈ సందర్భంగా తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు మాట్లాడుతూ ఖమ్మం జిల్లా లో రెండు, మూడు రోజులు కౌలు రైతుల నుంచి దృవీకరణ పత్రాలు ఆన్లైన్ చేసి మొక్కజొన్న కొనుగోలు చేసిన మార్క్ ఫెడ్ అధికారులు కౌలు రైతుల ఆన్లైన్ నిలుపుదల వల ఇబ్బందులు పడుతున్నారు అని అన్నారు, వ్యవసాయ శాఖ అధికారులు నుంచి రబీ సీజన్లో మొక్కజొన్న సాగు చేసిన రైతులు జాబితా తీసుకుని మొక్కజొన్న కొనుగోలు చేస్తున్న మార్క్ ఫెడ్ తమ వద్ద ఉన్న రైతులు జాబితా లో కొందరు పేర్లు మిస్ కావడం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు అని అన్నారు .వ్యవసాయ శాఖ ఆన్లైన్ పోర్టల్ జాబితా లో రైతులు పేర్లు కొందరు నమోదు కాలేదని ఇబ్బందులు పడుతున్నారని మరోవైపు జాబితాలో పేర్లు మిస్ చేయడం సరికాదని వ్యవసాయ అధికారుల దృవీకరణ తో మొక్కజొన్న కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు.వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రోత్సాహం తో ఖమ్మం జిల్లా లో పామాయిల్ సాగు పెరిగింది అని అట్టి పామాయిల్ తోటల్లో అంతర పంట మొక్కజొన్న సాగు చేసిన రైతులు తమ పేర్ల వ్యవసాయ శాఖ ఆన్లైన్ పోర్టల్ లో లేకపోవడం వల్ల మొక్కజొన్న విక్రయం చేయలేని పరిస్థితుల్లో ఉన్నారు అని, పామాయిల్ తోటల్లో అంతర పంట మొక్కజొన్న సాగు చేసిన రైతులు నుంచి పంట కొనుగోలు చేయాలని కోరారు ఈ కార్యక్రమంలో రైతులు వెంపటి వెంకటేశ్వరరావు, చంద్ర వెంకట్రావు, రాజేంద్ర ప్రసాద్, లక్ష్మణ్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# ప్రైవేట్ ఫైనాన్స్ ఏజెంట్ల'లోన్' జులుం







-ఇంటికి తాళం వేస్తామంటూ వేధింపులు
-రాత్రి సమయాల్లో వచ్చి బూతు పురాణం..
-యువకుని పట్ల ఇష్టారాజ్యం..

మసాయిపేట, ఏప్రిల్ 29 హిందూస్థాన్ మీడియా

ప్రైవేట్ లోన్ రికవరీ ఏజెంట్ల ఆగడాలు మితిమీరిపోతున్నాయి.నిబంధనలకు విరుద్ధంగా రాత్రి సమయాల్లో ఇళ్లకు వచ్చి మహిళలు,పిల్లలు అని చూడకుండా అసభ్య పదజాలంతో దూషిస్తూ సామాన్యులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారు. తాజాగా బజాజ్ ఫైనాన్స్ ఏజెంట్లు ఒక సామాన్యుని ఇంటికి వచ్చి అరాచకం సృష్టించిన వైనం స్థానికంగా కలకలం రేపింది.

-ఇంటికి తాళం వేసి,బండి తీసుకెళ్తామని బెదిరింపులు..

ఒకవైపు ప్రభుత్వం,రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రికవరీ ఏజెంట్ల కోసం కఠిన నిబంధనలు అమలు చేస్తున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో ఏజెంట్లు వాటిని బేఖాతరు చేస్తున్నారు.సాయంత్రం వేళ ఇంటికి వచ్చిన ఏజెంట్లు,బాధితుడిని తీవ్రంగా భయభ్రాంతులకు గురిచేశారు."మీ ఇంటికి తాళం వేస్తాం..బండిని లాక్కెళ్తాం"అంటూ బహిరంగంగానే బెదిరింపులకు పాల్పడ్డారు.

-ఐడీ కార్డుల్లేవు..కానీ వేధింపులు మాత్రం మెండు.!

కనీసం తమ సంస్థ ఐడీ కార్డులు కూడా చూపించకుండా రికవరీకి రావడంపై బాధితులు అభ్యంతరం వ్యక్తం చేశారు.ఫిజికల్ ఐడీ కార్డు అడిగితే దురుసుగా సమాధానం చెబుతూ,ఫోన్లలో ఉన్న సాఫ్ట్ కాపీలను చూపిస్తూ కాలయాపన చేశారు. లోన్ చెల్లించడానికి సమయం అడిగినప్పటికీ, ఏమాత్రం మానవత్వం లేకుండా ప్రవర్తించినట్లు వీడియోల ద్వారా స్పష్టమవుతోంది.

-అర్ధరాత్రి రావడమేంటని గ్రామస్తుల ఆగ్రహం..?

రాత్రి సమయంలో వచ్చి ఒక కుటుంబాన్ని ఇలా రోడ్డు మీదకు లాగడంపై స్థానిక గ్రామస్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.ఏజెంట్ల తీరుపై మండిపడుతూ, బాధితుడికి అండగా నిలిచారు. "పద్ధతి ప్రకారం రావాలి కానీ,ఇలా రాత్రిపూట వచ్చి వేధించడం ఏంటని"వారు నిలదీశారు.రికవరీ ఏజెంట్ల విపరీత ధోరణి వల్ల సామాన్యులు మానసిక ఒత్తిడికి లోనవుతున్నారని, అధికారులు స్పందించి ఇలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.లోన్ రికవరీ విషయంలో ఏజెంట్లు ఉదయం 8గంటల నుండి సాయంత్రం7గంటల లోపు మాత్రమే రావాలని నిబంధనలు చెబుతున్నాయి. ఎవరైనా ఈ నిబంధనలు మీరితే తక్షణమే పోలీసులకు ఫిర్యాదు చేయాలని నిపుణులు సూచిస్తున్నారు.

# ప్రైవేట్ 'గోల్డెన్ ఫంక్షన్‌హాల్' దందాకు పంచాయతీ నీరు





-వడియారంలో యథేచ్ఛగా సాగుతున్న పంచాయతీ ట్రాక్టర్ల దుర్వినియోగం..
-ప్రైవేట్ ఫంక్షన్ హాల్..పంచాయతీ ట్యాంకర్.!
-పంచాయతీ సెక్రటరీ 'నీళ్లు'నమలడంపై ఆగ్రహం..
-ప్రజల సొత్తు..ప్రైవేట్ వ్యక్తుల పాలు.!

చేగుంట, ఏప్రిల్ 29హిందూస్థాన్ మీడియా

ప్రజల దాహార్తిని తీర్చాల్సిన పంచాయతీ నీరు ప్రైవేట్ వ్యక్తుల జేబులు నింపుతోంది.గ్రామ అభివృద్ధికి సాక్షిగా నిలవాల్సిన ప్రభుత్వ వాహనాలు, ప్రైవేట్ వ్యాపార సంస్థల సేవలో తరిస్తున్నాయి. మెదక్ జిల్లా చేగుంట మండలం వడియారం గ్రామంలో బుధవారం వెలుగు చూసిన ఈ ఉదంతం ఇప్పుడు స్థానికంగా తీవ్ర దుమారం రేపుతోంది.

-ప్రైవేట్ ఫంక్షన్ హాల్ ..పంచాయతీ ట్యాంకర్.!

గ్రామస్తుల సమాచారం ప్రకారం..వడియారం గ్రామ పరిధిలోని'గోల్డెన్ ఫంక్షన్ హాల్'లో బుధవారం గ్రామ పంచాయతీకి చెందిన నీటి ట్యాంకర్‌తో నీటిని నింపడంతో పలువురు స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సామాన్య ప్రజలు చుక్క నీటి కోసం అల్లాడుతుంటే, నిబంధనలకు విరుద్ధంగా పంచాయతీ ట్రాక్టర్‌ను ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌కు పంపడం వెనుక భారీ అవినీతి దాగి ఉందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

-నాకేం తెలియదు. .పంచాయతీ సెక్రటరీ 'నీళ్లు' నమలడంపై ఆగ్రహం.!

అక్రమ రవాణాపై గ్రామ పంచాయతీ కార్యదర్శిని వివరణ కోరగా"నాకు తెలియకుండానే ఇదంతా జరిగిపోయింది"అంటూ నీళ్లు నమలడం గమనార్హం. బాధ్యతాయుతమైన పదవిలో ఉండి,తన కళ్లముందే ప్రభుత్వ ఆస్తులు దుర్వినియోగం అవుతుంటే 'తెలియదు' అని తప్పించుకోవడంపై గ్రామస్తులు మండిపడుతున్నారు.ఉన్నతాధికారుల అండదండలు లేకుండానే ఇంత బహిరంగంగా అక్రమాలు జరుగుతున్నాయా?లేక కిందస్థాయి సిబ్బందే 'మామూళ్ల' మత్తులో మునిగిపోయారా.? అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు

-ప్రజల సొత్తు.. ప్రైవేట్ వ్యక్తుల పాలు.!




వేసవి సెగలు మొదలైన తరుణంలో గ్రామాల్లో నీటి ఎద్దడి తలెత్తకుండా చూడాల్సిన బాధ్యత పంచాయతీపై ఉంది. కానీ ఇక్కడ మాత్రం సీన్ రివర్స్ అయింది.ప్రజల పన్నుల రూపంలో కొనుగోలు చేసిన ట్రాక్టర్లను,ప్రజల కోసం వినియోగించాల్సిన నీటిని ఇలా ప్రైవేట్ సంస్థలకు అమ్ముకోవడం సిగ్గుచేటని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

# అభివృద్ధి పనులు వేగవంతంగా పూర్తి చేయాలి





**-విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు..**
**-రాజేంద్రనగర్ జోనల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి**

రాజేంద్రనగర్,ఏప్రిల్ 29హిందూస్థాన్ మీడియా

జోన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో కొనసాగుతున్న ప్రాజెక్ట్స్ ఆభివృద్ధి నిర్మాణ పనులను ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సకాలంలో పూర్తి చేయాలని జిహెచ్ఎంసి రాజేంద్రనగర్ జోన్ జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డి అధికారులను ఆదేశించారు.రాజేంద్రనగర్ జోన్ నూతన జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డి సర్కిల్ కార్యాలయంలో బుధవారం జోన్ పరిధిలోని పలు సర్కిల్లో జరుగుతున్న వివిధ ప్రాజెక్ట్స్, అభివృద్ధి నిర్మాణ పనులపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో జోనల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి రోడ్లు విస్తరణ, డ్రైనేజీ, నాలా అభివృద్ధి నిర్మాణ పనులు, తదితర అంశాలపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇప్పటికే కొనసాగుతున్న పనులను నిర్దేశిత గడువులోగా నాణ్యతతో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.ఈ సందర్భంగా జోనల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ...ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా పనులు వేగవంతంగా పూర్తి చేయాలని,సమస్యలు ఎదురైన ప్రాంతాల్లో తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు.పనుల్లో నిర్లక్ష్యం వహించిన పక్షంలో బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సాంకేతిక సమస్యలను అధిగమించి స్థానిక ప్రజలకు ఎలాంటి సమస్యలు లేకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. జోన్ పరిధిలో అభివృద్ధి పనులను మరింత సమర్ధవంతంగా అమలు చేయాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో ఇంజినీరింగ్ విభాగం ఎస్ఈ నరేందర్ గౌడ్, ప్రాజెక్ట్స్ ఎస్ఈ మోహన్ రెడ్డి, టౌన్ ప్లానింగ్ జోనల్ సిటీ ప్లానర్ శ్రీనివాసరావు, ఈఈ,డి ఈలు, ఏఈలు, ఏసీపీలు ఇతర అధికారులు, పాల్గొన్నారు.

# క్యాతనపల్లి మున్సిపల్ కౌన్సిల్ సమావేశం






**-36అంశాలకు ఏకగ్రీవ ఆమోదం**

రామకృష్ణాపూర్,ఏప్రిల్ 29హిందూస్థాన్ మీడియా

క్యాతనపల్లి మున్సిపాలిటీ కార్యాలయంలో బుధవారం చైర్‌పర్సన్ గొడిసెల సంధ్యారాణి అధ్యక్షతన కౌన్సిల్ సాధారణ సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో మొత్తం36 అంశాలతో కూడిన ఎజెండాను ఇంచార్జ్ మేనేజర్ సభ్యులకు వివరించగా, వాటన్నింటినీ కౌన్సిల్ సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు.ఈ సమావేశంలో ముఖ్యంగా వర్షాకాలంలో వరద నీరు ఇళ్లలోకి చేరి ప్రజలు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో బి-జోన్ నుండి విద్యానగర్ వరకు 400 మీటర్ల స్టార్మ్ వాటర్ డ్రెయిన్ నిర్మాణానికి రూ.2కోట్ల మంజూరు విషయాన్ని చైర్‌పర్సన్ ప్రస్తావించారు. అలాగే సింగరేణి భూములపై నివసిస్తున్న, డీడీ ద్వారా చెల్లింపులు చేసిన సుమారు 1700 మంది లబ్ధిదారులకు జి.ఓ.ఎంఎస్ నెం.76 ప్రకారం“డీడ్ ఆఫ్ కన్వీనెన్స్”సర్టిఫికెట్లు అందించేలా జిల్లా కలెక్టర్‌కు లేఖ ఇవ్వనున్నట్లు తెలిపారు. ప్రస్తుతం ఉన్న మున్సిపల్ కార్యాలయం పాతబడిన కారణంగా కొత్త భవనం నిర్మాణానికి రూ.6 కోట్ల నిధుల కోసం సంబంధిత అధికారులకు ప్రతిపాదన పంపనున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్లు పట్టణంలో బోర్లు ఎండిపోవడంతో నీటి కొరత తీవ్రంగా ఉందని, కొత్త బోర్లు తవ్వడం మరియు ఉన్న బోర్లకు మోటర్లు అమర్చి తాగునీటి సరఫరా మెరుగుపరచాలని కోరారు. అలాగే కుక్కలు, కోతుల సమస్య పెరిగి ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్నందున కుక్కలకు టీకాలు వేయడం, కోతులను పట్టుకుని అడవుల్లో విడిచిపెట్టాలని సూచించారు. అలాగే పట్టణంలో చెత్త నిర్వహణపై కఠిన చర్యలు తీసుకోవాలని,రోడ్లపై చెత్త వేస్తున్న వారిపై చర్యలు చేపట్టాలని కోరారు.వేసవి కాలంలో అవసరమైన ప్రాంతాల్లో చలి వేంద్రాలు ఏర్పాటు చేయాలని సూచించారు.ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ ఏ.మారుతి ప్రసాద్ మాట్లాడుతూ....ఇంటి యజమాని మరణించిన సందర్భంలో ఎన్ఎఫ్ బిఎస్ పథకం కింద రూ.20,000 సహాయం అందుతుందని ప్రజలు ఉపయోగించుకోవాలని తెలిపారు.అలాగే మే11 నుండి జూన్ 9వరకు జరగనున్న జనాభా గణనకు ప్రజలు సహకరించాలని కోరారు.ఈ సమావేశంలో వైస్ చైర్‌పర్సన్ మిట్టపల్లి సరిత,కౌన్సిలర్లు కె.సతీష్ తదితరులు, ఇంచార్జ్ మేనేజర్ యం.సుమతి,డీఈ జి. ఆశ్రిత్,ఎంఏఈ బి.రాజ్‌కుమార్, టీపీఎస్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# మేడ్చల్‌లో భరోసా టీమ్ అవగాహన కార్యక్రమాలు







మేడ్చల్,ఏప్రిల్ 29 హిందూస్థాన్ మీడియా

ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా మేడ్చల్ భరోసా టీమ్ ఆధ్వర్యంలో బుధవారం మూడు అవగాహన కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహించడం జరిగిందని తెలిపారు.సమాజంలో పెరుగుతున్న సామాజిక సమస్యలపై ప్రజలకు చైతన్యం కల్పించడం లక్ష్యంగా ఈ కార్యక్రమాలు చేపట్టడం జరిగిందని,మొదటి కార్యక్రమం మేడ్చల్‌లోని జీహెచ్ఎంసీ కార్యాలయంలో నిర్వహించగా,రెండవది మేడ్చల్ బస్ స్టాండ్ వద్ద, మూడవది ట్రైల్ బ్లేజర్స్ జాస్మిన్ హోమ్‌లో నిర్వహించామని తెలిపారు.ఈ మూడు కార్యక్రమాలకు కలిపి మొత్తం 278మంది హాజరయ్యారని అన్నారు.ఈ సందర్భంగా భరోసా టీమ్ సభ్యులు మాట్లాడుతూ...పితృస్వామ్య వ్యవస్థ, మహిళలపై ద్వేష భావన,మానవ అక్రమ రవాణా, లైంగిక దోపిడీ, కార్మిక అక్రమ రవాణా, ఈవ్‌టీజింగ్, బాల్య వివాహాలు, బాలలపై లైంగిక దాడులు వంటి కీలక అంశాలపై సమగ్రంగా వివరించడం జరిగిందని అన్నారు.ఈ సమస్యలు సమాజంపై చూపుతున్న ప్రతికూల ప్రభావాలను వివరించి, వాటిని అరికట్టడంలో ప్రజల పాత్ర ఎంతో ముఖ్యమని సూచించారు.అలాగే బాలల రక్షణకు సంబంధించిన పోక్సో చట్టం--2012 పై ప్రత్యేకంగా అవగాహన కల్పించడం జరిగిందని ఈ చట్టం కింద బాలలపై జరిగే లైంగిక నేరాలకు కఠిన శిక్షలు ఉంటాయని, బాధితులు ఎలాంటి భయాలు లేకుండా పోలీసులకు లేదా సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయాలని సూచించారు.ఈ కార్యక్రమాల ద్వారా ప్రజల్లో చట్టాలపై అవగాహన పెంపొందించడంతో పాటు,మహిళలు మరియు బాలల భద్రతపై జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరాన్ని వివరించారు. సమాజంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరిస్తేనే ఇలాంటి నేరాలను పూర్తిగా అరికట్టగలమని భరోసా టీమ్ సభ్యులు తెలిపారు.ప్రజల నుంచి మంచి స్పందన లభించిందని, ఇలాంటి అవగాహన కార్యక్రమాలను భవిష్యత్తులో మరింత విస్తృతంగా నిర్వహించనున్నట్లు వారు వెల్లడించారు.ఈ కార్యక్రమంలో సెంటర్ అడ్మిన్ కల్యాణి, లీగల్ కౌన్సిలర్ యు.రోజా, సపోర్ట్ పర్సన్స్ మౌనిక, సమీనా, మౌనిక, స్వప్న,ఏఎన్ఎమ్ సరీత ప్రజలు పాల్గొన్నారు.

## ప్రతి గ్రామంలో మేడే జెండా ఎగరాలి

**-కార్మికులకు శివ నాయక్ పిలుపు**
**-లేబర్ కోడ్ల రద్దు వరకు పోరాటం కొనసాగించాలి..**
**-కారేపల్లిలో సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ సమావేశం**



కారేపల్లి,ఏప్రిల్ 29హిందూస్థాన్ మీడియా

కారేపల్లి కేంద్రంలో సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన ముఖ్యకార్యకర్తల జనరల్ బాడీ సమావేశం ఉత్సాహంగా జరిగింది.ఈ సమావేశానికి పార్టీ జిల్లా నాయకుడు శివనాయక్ ముఖ్యఅతిథిగా హాజరై శ్రేణులకు మార్గనిర్దేశం చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...మే 1న జరగనున్న 140వ మేడే దినోత్సవాన్ని ప్రతి గ్రామం, పట్టణంలోని ప్రతి వాడలో ఘనంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. కార్మిక వర్గ పోరాటాలకు ప్రతీకగా నిలిచిన చికాగో అమర వీరుల స్ఫూర్తితో ఉద్యమాలను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నాలుగు లేబర్ కోడ్లు కార్మికుల హక్కులను హరించే విధంగా ఉన్నాయని ఆయన విమర్శించారు.ఈ చట్టాలు పెద్ద కార్పొరేట్ సంస్థలు,బహుళజాతి కంపెనీలకు అనుకూలంగా రూపొందించబడ్డాయని,కార్మిక వర్గానికి నష్టం కలిగిస్తున్నాయని పేర్కొన్నారు.ఈ కోడ్లను రద్దు చేసే వరకు నిరంతర పోరాటం కొనసాగించాలని పిలుపునిచ్చారు. అంతర్జాతీయ అంశాలపై స్పందిస్తూ, ఇరాన్‌పై అమెరికా--ఇజ్రాయెల్ చర్యలను ఆయన ఖండించారు. సామ్రాజ్యవాద ధోరణులను అరికట్టాలని,ప్రపంచ శాంతిని కాపాడాలని కోరారు. దేశ పాలక వర్గాలు మతాన్ని ఉపయోగించి ప్రజలను మోసం చేస్తున్నాయని ఆరోపించారు.ఈ సమావేశంలో సుంకర బుచ్చయ్య, దంతాల నారాయణ,నాగేష్,సీతారాములు తదితరులు పాల్గొన్నారు.

## అప్పాయిగూడెం గిడ్డంగిలో మొక్కజొన్నల నిల్వ ప్రక్రియను పునఃప్రారంభించిన

**-ఇల్లందు మార్కెట్ కమిటి చైర్మన్ బానోత్ రాంబాబు**



కారేపల్లి,ఏప్రిల్ 29హిందూస్థాన్ మీడియా

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రైతు పండించిన ప్రతి గింజ కొనుగోలు చేయాలని ఉద్దేశంతో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ఆధ్వర్యంలో కొనుగోలు చేస్తున్న మొక్కజొన్న నిల్వ చేసేందుకు గత 5 సంవత్సరాలుగా వైరా నియోజకవర్గం సింగరేణి మండలం అప్పాయిగూడెశీ గ్రామంలోని గిడ్డంగిలో మొక్కజొన్నల నిల్వ ప్రక్రియను ఇల్లందు మార్కెట్ కమిటి చైర్మన్ బానోత్ రాంబాబు ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో స్థానిక గ్రామ పంచాయతీ సర్పంచ్ దండు ప్రవీణ్,గిడ్డంగి అధికారి రాజశేఖర్ రెడ్డి,రాష్ట్ర నాయకురాలు పగడాల మంజుల,ఉపసర్పంచ్,ఎట్టి సంధ్యరాణి, అప్పాయిగూడెం సెక్రటరీ క్రిష్ణవేణి, కాంగ్రెస్ నాయకులు పులసం భద్రం,భీముడు,వార్డు మెంబర్స్ రమేష్ శాలి, కృష్ణ ప్రసాద్,గ్రామ ప్రజలు,మార్కెట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## బాలల సంరక్షణ కమిటీ మీటింగ్ ఏర్పాటు



శివంపేట,ఏప్రిల్ 29హిందూస్థాన్ మీడియా

శివంపేట మండలంలోని గుండ్లపల్లి గ్రామంలో సర్పంచ్ అధ్యక్షతన అంగన్వాడి టీచర్ ఆధ్వర్యంలో బాలల సంరక్షణ కమిటీ మీటింగ్ ఏర్పాటు చేయడం జరిగింది.దీని ముఖ్యఉద్దేశం18 సంవత్సరాల వయసు లోపు గల పిల్లలకు పనికి పంపరాదు,బాల్య వివాహాలు అరికట్టాలి.ముఖ్యంగా గ్రామంలో 18సంవత్సరాల లోపు పిల్లలకు మద్యం,సిగరెట్,గుట్కా మత్తు పదార్థాలు క్రయవిక్రయాలు వారికి అమ్మరాదని, అమ్మినచో చట్టరీత్యా చర్యలు తీసుకోవడం జరుగుతుంది.ఇది ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు ప్రజా పాల-ప్రగతి ప్రణాళిక 99 రోజులు భాగంగా నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ సత్యనారాయణ ఉప్పునూతల సత్యనారాయణగౌడ్, దత్తాత్రేయగౌడ్, పరశురాం, మాజీ సర్పంచ్ తాటి కిష్టయ్య, బజారి శ్రీనివాస్ రెడ్డి, బదారి మల్లారెడ్డి, గొర్రె సత్యనారాయణ రెడ్డి, ఎలుక ధర్మరెడ్డి, మస్కూరి ప్రేమ్ దాస్ మరియు గ్రామ పెద్దలు పాల్గొనడం జరిగింది.

# బిజినెస్

## ప్రీమియం ఇళ్లకు జై.. సామాన్యులకు బై?

### హైదరాబాద్ రియల్ మార్కెట్‌లో ఏం జరుగుతోంది?



ఏప్రిల్ 29 హిందుస్థాన్ మీడియా

భాగ్యనగరంలో రియల్ ఎస్టేట్ మార్కెట్ కొత్త శిఖరాలను అధిరోహిస్తోంది. ముఖ్యంగా రూ.1 కోటి నుంచి రూ.2 కోట్లు, అంతకుమించి విలువైన ప్రీమియం, లగ్జరీ ఇళ్ల అమ్మకాలు భారీగా ఊపందుకున్నాయి. ఓవైపు ఈ జోరుతో డెవలపర్లు భారీ ప్రాజెక్టులు ప్రకటిస్తుండగా, మరోవైపు సామాన్యులు, మధ్యతరగతి ప్రజలకు సొంతింటి కల కల్లగానే మిగిలి పోతోందనే ఆందోళన వ్యక్తమవుతోంది. పెరుగుతున్న ఈ నిర్మాణాలను తట్టుకునేంత పటిష్టంగా నగర మౌలిక వసతులు ఉన్నాయా అనే చర్చ కూడా మొదలైంది.

**ప్రీమియం సెగ్మెంట్‌లో అమ్మకాల సునామీ**

2026 మొదటి త్రైమాసికం (జనవరి-మార్చి) గణాంకాలు హైదరాబాద్ రియల్ ఎస్టేట్ మార్కెట్ స్థిరమైన వృద్ధిని కనబరుస్తున్నాయని స్పష్టం చేస్తున్నాయి. ప్రముఖ మీడియా సంస్థ హిందుస్థాన్ టైమ్స్ నివేదిక ప్రకారం, దేశంలోని ఇతర ప్రధాన నగరాల్లో అమ్మకాలు తగ్గుముఖం పట్టినప్పటికీ, హైదరాబాద్‌లో మాత్రం గతేడాదితో పోలిస్తే 1శాతం వృద్ధితో 9,541 నివాస యూనిట్లు అమ్ముడయ్యాయి. వీటిలో అత్యధికంగా రూ.1 కోటి నుంచి రూ.2 కోట్ల ధరల శ్రేణిలోని ఇళ్లే ఉన్నాయి. ఈ విభాగంలో ఏకంగా 4,061 యూనిట్లు అమ్ముడుపోగా, రూ.2 కోట్ల పైబడిన ఇళ్ల అమ్మకాల్లోనూ బలమైన వృద్ధి నమోదైంది. ఇదే సమయంలో సగటు ఆస్తి ధరలు గతేడాదితో పోలిస్తే 9 శాతం పెరిగి చదరపు అడుగుకు రూ.8,211కి చేరాయి.

## చైనా కారు... 'రాకెట్'లా దూసుకుపోతుంది!

ఏప్రిల్ 29 హిందుస్థాన్ మీడియా



చైనాకు చెందిన ప్రముఖ ఎలక్ట్రానిక్స్ సంస్థ డ్రీమ్ టెక్నాలజీ ఆటోమొబైల్ రంగంలోకి అడుగుపెడుతూ సంచలనం సృష్టించింది. శాన్ ఫ్రాన్సిస్కోలో జరిగిన 'డ్రీమ్ నెక్స్ట్' ఈవెంట్‌లో 'నెబ్యులా నెక్స్01 జెట్ ఎడిషన్' పేరుతో తన తొలి సూపర్ కారును ఆవిష్కరించింది. ఈ కారు కేవలం 0.9 సెకన్లలోనే 0 నుంచి 100 కిలోమీటర్ల వేగాన్ని అందుకుని, ఆటోమొబైల్ ప్రపంచంలో పెను ప్రకంపనలు రేపుతోంది. ఈ అద్భుతమైన వేగానికి కారణం కారులో అమర్చిన డ్యూయల్ సాలిడ్ రాకెట్ బూస్టర్లు. సాధారణ ఎలక్ట్రిక్ మోటార్లతో పాటు ఈ రాకెట్ సిస్టమ్ 100 కిలోన్యూటన్ల శక్తిని విడుదల చేస్తుంది. కేవలం 150 మిల్లీసెకన్లలో స్పందించే ఈ టెక్నాలజీతో, ఈ కారు బుగాటీ చిరాన్, కోయినిగ్సెగ్ జెస్కో వంటి ప్రపంచ ప్రఖ్యాత హైపర్ కార్లకు గట్టి పోటీ ఇస్తోంది. భద్రత కోసం ప్రత్యేక ఎలక్ట్రానిక్ కంట్రోల్ సిస్టమ్‌లను కూడా పొందుపరిచారు. కేవలం వేగమే కాదు, ఈ కారులో అత్యాధునిక బ్యాటరీ టెక్నాలజీని కూడా ఉపయోగించారు. సల్ఫైడ్ ఆధారిత ఆల్-సాలిడ్ స్టేట్ బ్యాటరీతో దీనిని రూపొందించారు. ఇది 450 డబ్ల్యూహెచ్/కేజీ కంటే ఎక్కువ ఎనర్జీ డెన్సిటీని కలిగి ఉండటమే కాకుండా, మెరుగైన భద్రతను అందిస్తుంది. ఒక్కసారి ఛార్జ్ చేస్తే ఈ కారు 550 కిలోమీటర్లకు పైగా ప్రయాణిస్తుంది. దీంతో పాటు 1 మిల్లీసెకన్‌లో స్పందించే స్టీర్-బై-వైర్ సిస్టమ్, టైర్ పంక్చర్ అయినప్పుడు కూడా కారును స్థిరంగా ఉంచే టెక్నాలజీ వంటివి ఇందులో ఉన్నాయి. ఇక డ్రైవింగ్ అనుభవాన్ని మెరుగుపరచడానికి వీఎల్ఏ (విజన్-లాంగ్వేజ్-యాక్షన్) ఆధారిత ఇంటెలిజెంట్ డ్రైవింగ్ సిస్టమ్‌ను అమర్చారు. పొగ, పర్వత ప్రాంతాల వంటి కఠిన పరిస్థితుల్లోనూ ఇది సమర్థంగా పనిచేస్తుందని కంపెనీ తెలిపింది. 600 మీటర్ల దూరంలోని వస్తువులను కూడా గుర్తించగల శక్తివంతమైన డీఫాక్స్1 ఎల్ఐడీఏఆర్ సెన్సార్ దీనిలోని మరో ప్రత్యేకత. సెడాన్ ఆకారంలో ఉన్నప్పటికీ, స్పోర్ట్స్ కారు లుక్‌తో నెబ్యులా నెక్స్01 ఆకట్టుకుంటోంది. ఈ కారు ధర, లభ్యత పై కంపెనీ ఇంకా వివరాలు వెల్లడించలేదు. ఏదేమైనా, ఈ రాకెట్-బూస్టెడ్ ఎలక్ట్రిక్ కారు భవిష్యత్ వాహన సాంకేతికతకు ఒక నిదర్శనంగా నిలుస్తోంది.

## లాభాల్లో ముగిసినా... గరిష్ఠాల నుంచి వెనక్కి తగ్గిన మార్కెట్లు

ఏప్రిల్ 29 హిందుస్థాన్ మీడియా



దేశీయ స్టాక్ మార్కెట్లు బుధవారం లాభాలతో ముగిశాయి. అయితే, రోజంతా కొనసాగిన ఉత్సాహం చివరి గంటలో ఆవిరైంది. అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు భారీగా పెరగడంతో ఇన్వెస్టర్ల సెంటిమెంట్ దెబ్బతింది. దీంతో ఇంట్రాడే గరిష్ఠాల నుంచి సూచీలు వెనక్కి తగ్గాయి. ట్రేడింగ్ ముగిసే సమయానికి సెన్సెక్స్ 609.45 పాయింట్ల లాభంతో 77,496.36 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 181.95 పాయింట్లు పెరిగి 24,177.65 వద్ద ముగిసింది. అమెరికా-ఇరాన్ మధ్య చర్చలు నిలిచిపోవడం, మే 1 నుంచి ఒపెక్ కూటమి నుంచి వైదొలగుతున్నట్లు యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) ప్రకటించడంతో సరఫరాపై ఆందోళనలు పెరిగాయి. దీంతో బ్రెంట్ క్రూడ్ ఆయిల్ ధర 3 శాతానికి పైగా పెరిగి బ్యారెల్‌కు 114.60 డాలర్లకు చేరింది. ఈ పరిణామం మార్కెట్ల జోరుకు బ్రేకులు వేసింది. టెక్నికల్ గా చూస్తే, నిఫ్టీకి 24,200 వద్ద కీలక నిరోధకం ఉందని, ఒకవేళ సూచీ కిందకు వస్తే 24,000-24,100 స్థాయి మద్దతుగా నిలుస్తుందని విశ్లేషకులు చెబుతున్నారు. సూచీలు చివరి గంటలో వెనక్కి తగ్గినప్పటికీ ఐటీసీ, టెక్ మహీంద్రా, మారుతీ సుజుకీ వంటి హెవీవెయిట్ షేర్లలో కొనుగోళ్ల మద్దతు లభించడంతో మార్కెట్లు లాభాల్లో ముగియగలిగాయి. బ్రాడర్ మార్కెట్లు మిశ్రమంగా స్పందించాయి. నిఫ్టీ మిడ్‌క్యాప్ స్వల్పంగా నష్టపోగా, స్మాల్‌క్యాప్ సూచీ 0.65 శాతం లాభపడింది. రంగాల వారీగా చూస్తే ఎఫ్ఎంసీజీ, రియల్టీ షేర్లు రాణించగా, కన్‌స్ట్రక్షన్ డ్యూరబుల్, మీడియా రంగాల సూచీలు నష్టపోయాయి. పెరుగుతున్న చమురు ధరలు, అమెరికా ఫెడ్ పాలసీ నిర్ణయం వంటి అంశాలు సమీప భవిష్యత్తులో మార్కెట్లపై ప్రభావం చూపవచ్చని నిపుణులు అంచనా వేస్తున్నారు.

## భారత బౌలర్లంటే ద్వేషం.. పాకిస్థాన్ క్రికెటర్ తీవ్ర వ్యాఖ్యలు!

ఏప్రిల్ 29 హిందుస్థాన్ మీడియా




పాకిస్థాన్ క్రికెటర్ హసన్ నవాజ్ చేసిన వ్యాఖ్యలు క్రికెట్ ప్రపంచంలో తీవ్ర దుమారం రేపుతున్నాయి. ప్రస్తుతం జరుగుతున్న పాకిస్థాన్ సూపర్ లీగ్ (పీఎస్ఎల్) 2026 సందర్భంగా ఒక స్థానిక న్యూస్ ఛానెల్‌తో మాట్లాడుతూ, భారత బౌలర్ల పట్ల తనకున్న అభిప్రాయాన్ని వివాదాస్పద రీతిలో వ్యక్తం చేశాడు. అతని మాటలపై ప్రపంచవ్యాప్తంగా ఉన్న క్రికెట్ అభిమానులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇంటర్వ్యూలో భాగంగా ఏ బౌలర్‌పై పరుగులు చేయడానికి ఇష్టపడతారని ప్రశ్నించగా, హసన్ నవాజ్ బదులిస్తూ.. "భారత్‌తో ఆడేటప్పుడు సహజంగానే అదనపు ప్రేరణ ఉంటుంది. వాళ్ల బౌలర్లపై దాడి చేయాలనే భావన కలుగుతుంది. నిజం చెప్పాలంటే వాళ్ల బౌలర్లందరినీ నేను ద్వేషిస్తాను. భవిష్యత్తులో అవకాశం వస్తే, కచ్చితంగా వాళ్ల బౌలింగ్‌పై దాడి చేయడానికి ప్రయత్నిస్తా" అని సంచలన వ్యాఖ్యలు చేశాడు. అయితే, కేవలం బౌలర్ పేరు చూసి కాకుండా, మ్యాచ్ పరిస్థితిని బట్టి తన ఆటతీరు ఉంటుందని హసన్ నవాజ్ వివరించాడు. "అవసరమైన రన్ రేట్ 10, 12 లేదా 15 పరుగుల చొప్పున ఉన్నప్పుడు, బౌలర్ ఎవరనేది చూడకుండా పరుగులు చేయడానికి ప్రయత్నిస్తా. అంతా మ్యాచ్‌పై ఆధారపడి ఉంటుంది" అని అన్నాడు. భారత్, పాకిస్థాన్ మధ్య క్రికెట్ మైదానంలోనే కాకుండా వెలుపల కూడా తీవ్రమైన పోటీ ఉంటుంది. 2013 నుంచి ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక సిరీస్‌లు జరగనప్పటికీ, ఐసీసీ టోర్నమెంట్లలో మాత్రమే తలపడుతున్నాయి. ఈ మ్యాచ్‌లలో భారతదే స్పష్టమైన ఆధిపత్యం కొనసాగుతోంది. 2025లో అంతర్జాతీయ అరంగేట్రం చేసిన హసన్ నవాజ్, ఇప్పటివరకు 25 టీ20 మ్యాచ్‌లు ఆడి ఒక సెంచరీ (105 నాటౌట్), రెండు అర్ధసెంచరీలతో కలిపి 457 పరుగులు చేశాడు. అలాగే, 4 వన్డేల్లో 56.50 సగటుతో 113 పరుగులు సాధించాడు. అతను చివరిసారిగా 2025 నవంబర్‌లో దక్షిణాఫ్రికాతో జరిగిన మ్యాచ్‌లో పాకిస్థాన్ తరపున ఆడాడు. పీఎస్ఎల్ 2026లో క్వెట్టా గ్లాడియేటర్స్ తరఫున 10 మ్యాచ్‌లలో 291 పరుగులు చేసినప్పటికీ, ఆ జట్టు కేవలం 3 విజయాలతో పాయింట్ల పట్టికలో ఏడో స్థానంలో నిలిచి నిరాశపరిచింది.

## డ్రెస్సింగ్ రూంలో వేపింగ్.. చిక్కుల్లో రియాన్ పరాగ్..

# గతంలో డివిలియర్స్, ఫించ్ కూడా..!

ఏప్రిల్ 29 హిందుస్థాన్ మీడియా



రాజస్థాన్ రాయల్స్ (ఆర్ఆర్) యువ కెప్టెన్ రియాన్ పరాగ్ తీవ్ర వివాదంలో చిక్కుకున్నాడు. ఐపీఎల్ 2026 సీజన్‌లో భాగంగా పంజాబ్ కింగ్స్‌తో జరిగిన మ్యాచ్ సందర్భంగా డ్రెస్సింగ్ రూంలో వేపింగ్ (ఈ-సిగరెట్) తాగుతూ కెమెరాకు చిక్కాడు. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో క్రీడా వర్గాల్లో కలకలం రేగింది. పరాగ్ ప్రవర్తనపై అభిమానులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ, బీసీసీఐ వెంటనే విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

**గతంలోనూ ఇలాంటి ఘటనలు**

ఇలాంటి ఘటనలు గతంలోనూ జరిగాయి. 2026 జనవరిలో జరిగిన ఎస్ఏ20 లీగ్‌లో దక్షిణాఫ్రికా దిగ్గజం ఏబీ డివిలియర్స్ కూడా వేపింగ్ చేస్తూ కెమెరాకు చిక్కాడు. అయితే, దక్షిణాఫ్రికాలో వేపింగ్ చట్టవిరుద్ధం కాకపోవడంతో అతను ఎలాంటి శిక్షకు గురికాలేదు. 2020లో ఐపీఎల్ మ్యాచ్ లో ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ ఆరోన్ ఫించ్ కూడా ఇలాగే ప్రవర్తించాడు. కానీ, భారత చట్టాల ప్రకారం పరాగ్ పరిస్థితి భిన్నంగా ఉంది. ఈ వివాదం రియాన్ పరాగ్‌కు అత్యంత క్లిష్ట సమయంలో ఎదురైంది. సంజూ శాంసన్ చెన్నై సూపర్ కింగ్స్‌కు వెళ్లడంతో ఈ సీజన్‌లో రాజస్థాన్ కెప్టెన్సీ బాధ్యతలు చేపట్టిన 24 ఏళ్ల పరాగ్, ఇప్పటికే తీవ్ర ఒత్తిడిలో ఉన్నాడు. ఈ మ్యాచ్‌కు ముందు ఆడిన ఏడు ఇన్నింగ్స్‌లలో కేవలం 81 పరుగులు మాత్రమే చేసి బ్యాటింగ్‌లో విఫలమయ్యాడు. ఫామ్ లేమితో విమర్శలు ఎదుర్కొంటున్న అతనికి ఈ వివాదం కొత్త తలనొప్పిగా మారింది. అయితే, ఈ వివాదం జట్టు ప్రదర్శనపై ప్రభావం చూపలేదు. పంజాబ్ నిర్దేశించిన 222 పరుగుల భారీ లక్ష్యాన్ని రాజస్థాన్ రాయల్స్ మరో 6 వికెట్లు మిగిలి ఉండగానే ఛేదించి, ఈ సీజన్‌లో పంజాబ్‌కు తొలి ఓటమిని రుచిచూపించింది.

# స్పోర్ట్స్

## అతడి బ్యాటింగ్ సిసలైన సినిమా చూస్తున్నట్టే ఉంటుంది: పుజారా




ఏప్రిల్ 29 హిందుస్థాన్ మీడియా

రాజస్థాన్ రాయల్స్ యువ సంచలనం, 15 ఏళ్ల వైభవ్ సూర్యవంశీ ఆటతీరుపై భారత మాజీ ఆటగాడు ఛతేశ్వర్ పుజారా ప్రశంసల వర్షం కురిపించాడు. అతడి బ్యాటింగ్ చూస్తుంటే ఒక సినిమా చూసిన అనుభూతి కలుగుతుందని పుజారా అభివర్ణించాడు. పంజాబ్ కింగ్స్‌తో గతరాత్రి జరిగిన ఐపీఎల్ మ్యాచ్‌లో రాజస్థాన్ 6 వికెట్ల తేడాతో గెలిచిన నేపథ్యంలో పుజారా ఈ వ్యాఖ్యలు చేశాడు. ఈ మ్యాచ్‌లో 223 పరుగుల భారీ లక్ష్య ఛేదనలో సూర్యవంశీ కేవలం 16 బంతుల్లో 43 పరుగులు చేసి రాజస్థాన్‌కు అదిరిపోయే ఆరంభాన్ని ఇచ్చాడు. జియోస్టార్‌తో మాట్లాడుతూ పుజారా దీనిపై స్పందించాడు. "వైభవ్ సూర్యవంశీ బ్యాటింగ్ చేయడం ఒక సినిమాటిక్ అనుభవం. అతడు ఏ బౌలర్‌కైనా భయం లేకుండా ఎదురెళ్లే తీరు అద్భుతం. బంతిని చూసి, దానిని బాదడమే అతడికి తెలుసు. పవర్‌ప్లేలో అతడి దూకుడైన ఆటతీరే జట్టుకు తిరుగులేని ఆధిక్యాన్ని ఇస్తోంది" అని పుజారా వివరించాడు. ఇదే సమయంలో, మధ్య ఓవర్లలో రాణించిన స్పిన్నర్ యుజ్వేంద్ర చాహల్‌ను కూడా పుజారా మెచ్చుకున్నాడు. "పరుగులు ఇచ్చినా చాహల్ ధైర్యంగా బంతులు వేసి వికెట్లు తీయడానికి ప్రయత్నించాడు. అతడి వైవిధ్యమైన బౌలింగ్ అద్భుతం. స్పీడ్‌లో మార్పులు చేస్తూ బ్యాటర్లను ఇబ్బంది పెట్టాడు," అని తెలిపారు. ఈ మ్యాచ్‌లో రాజస్థాన్ మరో నాలుగు బంతులు మిగిలి ఉండగానే లక్ష్యాన్ని ఛేదించి పంజాబ్‌కు సీజన్‌లో తొలి ఓటమిని రుచి చూపించింది.

# ప్రపంచాన్ని షేక్ చేసిన రణ్‌వీర్ 'ధురంధర్'..
# ఇప్పుడు జపాన్‌లో విడుదల

- రణ్‌వీర్ సింగ్ 'ధురంధర్' చిత్రం జపాన్‌లో విడుదలకు సిద్ధం
- జులై 10న అక్కడి థియేటర్లలోకి రానున్న సినిమా
- ప్రపంచవ్యాప్తంగా ఇప్పటికే రూ. 1328 కోట్లకు పైగా వసూళ్లు
- ఆదిత్య ధర్ దర్శకత్వంలో తెరకెక్కిన స్పై యాక్షన్ థ్రిల్లర్
- నార్త్ అమెరికా, కెనడా, ఆస్ట్రేలియాలో ఆల్ టైమ్ రికార్డులు




ఏప్రిల్ 29 హిందూస్థాన్ మీడియా

బాలీవుడ్ స్టార్ హీరో రణ్‌వీర్ సింగ్ నటించిన బ్లాక్‌బస్టర్ చిత్రం 'ధురంధర్' (పార్ట్ 1) ఇప్పుడు జపాన్‌లో సందడి చేసేందుకు సిద్ధమైంది. ప్రపంచవ్యాప్తంగా బాక్సాఫీస్ రికార్డులను తిరగరాసిన ఈ స్పై యాక్షన్ థ్రిల్లర్, జులై 10న జపాన్‌లోని థియేటర్లలో విడుదల కానుంది. ఈ విషయాన్ని నిర్మాణ సంస్థలైన జియో స్టూడియోస్, బీ62 స్టూడియోస్ తమ అధికారిక ఇన్‌స్టాగ్రామ్ ఖాతాల ద్వారా ప్రకటించాయి. జపనీస్ భాషలో వివరాలతో కూడిన పోస్టర్‌ను కూడా విడుదల చేశాయి. "ఇక జపాన్ 'ధురంధర్' ఎనర్జీని చూసే సమయం వచ్చింది" అంటూ క్యాప్షన్ జోడించాయి. 2025 డిసెంబర్ 5న ప్రపంచవ్యాప్తంగా విడుదలైన ఈ చిత్రం, అప్పట్లో ఏకంగా రూ. 1328 కోట్లకు పైగా వసూళ్లు సాధించి సంచలనం సృష్టించింది. ముఖ్యంగా అంతర్జాతీయ మార్కెట్‌లో ఈ సినిమా అద్భుతమైన ప్రదర్శన కనబరిచింది. నార్త్ అమెరికాలో ఆల్ టైమ్ నంబర్ 1 హిందీ చిత్రంగా నిలవడమే కాకుండా కెనడా, ఆస్ట్రేలియాలో అత్యధిక వసూళ్లు సాధించిన భారతీయ సినిమాగా చరిత్రకెక్కింది. యూకేలో కూడా అత్యుత్తమ ప్రదర్శన కనబరిచిన చిత్రాల్లో ఒకటిగా నిలిచింది. ఆదిత్య ధర్ రచన, దర్శకత్వం, నిర్మాణంలో ఈ సినిమా తెరకెక్కింది. 'ధురంధర్' రెండు భాగాలుగా వస్తున్న చిత్రం. మొదటి భాగంలో, భారతదేశాన్ని లక్ష్యంగా చేసుకున్న ఉగ్రవాద నెట్‌వర్క్‌ను ఛేదించడానికి పాకిస్థాన్‌లోని కరాచీకి వెళ్లిన ఒక అండర్‌కవర్ భారతీయ ఇంటెలిజెన్స్ ఏజెంట్ కథను చూపించారు. దక్షిణాసియాలోని పలు వాస్తవ భౌగోళిక, రాజకీయ సంఘటనల స్ఫూర్తితో ఈ సినిమా కథను రూపొందించారు. ఈ చిత్రంలో రణ్‌వీర్ సింగ్‌తో పాటు అక్షయ్ ఖన్నా, సంజయ్ దత్, అర్జున్ రాంపాల్, ఆర్. మాధవన్ వంటి ప్రముఖ తారలు నటించారు. ప్రపంచవ్యాప్తంగా ఘన విజయం సాధించిన ఈ చిత్రం, జపాన్‌లో ఎలాంటి స్పందన రాబట్టుకుంటుందోనని సినీ వర్గాల్లో ఆసక్తి నెలకొంది.

# అబ్బాయిలకు కూడా కాస్టింగ్ కౌచ్ వేధింపులు ఉంటాయి

ఏప్రిల్ 29 హిందూస్థాన్ మీడియా



ఇండస్ట్రీలో 'కాస్టింగ్ కౌచ్' అనేది కేవలం మహిళలకే పరిమితం కాలేదని, అబ్బాయిలు కూడా ఇలాంటి వేధింపులు ఎదుర్కొంటారని సినీ నటుడు జేడీ చక్రవర్తి కుండబద్దలు కొట్టారు. ఒకప్పుడు తాను విలన్‌గా చిన్న పాత్రలు చేస్తున్న సమయంలో, తన స్నేహితురాలైన ఒక స్టార్ హీరోయిన్‌కు ఎదురైన చేదు అనుభవాన్ని కూడా ఆయన గుర్తు చేసుకున్నారు. ఒక సీనియర్ నిర్మాత ఆ హీరోయిన్‌తో అసభ్యంగా ప్రవర్తిస్తున్నప్పుడు... తాను, నటుడు సురేశ్ మంచం కింద దాక్కుని ఆ సంభాషణ విన్నామని చెప్పి షాక్ ఇచ్చారు. తన పెళ్లి గురించి వస్తున్న రూమర్లపై స్పందిస్తూ, తనకు తెలియకుండానే సోషల్ మీడియాలో తన పెళ్లిళ్లు జరిగిపోతున్నాయని ఎద్దేవా చేశారు. ఇక నటి మహేశ్వరితో తన అనుబంధం గురించి చెబుతూ, అప్పట్లో తామిద్దరం పెళ్లి చేసుకోవాలని అనుకున్న మాట వాస్తవమేనని, కానీ కొన్ని కారణాల వల్ల అది కుదరలేదని వివరించారు. తన గురువు రామ్ గోపాల్ వర్మ గురించి మాట్లాడుతూ, వర్మకు కోపం రాదని అందరూ అనుకుంటారని, కానీ 'సత్య' సినిమా షూటింగ్ సమయంలో ఆయన ఎమోషనల్ అయిన సందర్భాలు ఉన్నాయని సంచలన విషయాలు బయట పెట్టారు.

# రేపే థియేటర్లలోకి ధనుష్ కర



ఏప్రిల్ 29 హిందూస్థాన్ మీడియా

కోలీవుడ్ స్టార్ హీరో ధనుష్ నటించిన కొత్త సినిమా 'కర' ఏప్రిల్ 30న ప్రేక్షకుల ముందుకు రానుంది. తమిళంతో పాటు తెలుగులోనూ ఈ చిత్రం ఏకకాలంలో విడుదల కాబోతోంది. విఘ్నేష్ రాజా దర్శకత్వం వహించిన ఈ సినిమాపై మంచి అంచనాలు నెలకొన్నాయి. 1991 గల్ఫ్ యుద్ధం నాటి పరిస్థితులు, దేశంలో ఏర్పడిన ఇంధన సంక్షోభం నేపథ్యంలో ఈ సినిమాను పీరియడ్ యాక్షన్ థ్రిల్లర్‌గా తెరకెక్కించారు. ఇప్పటికే సెన్సార్ కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ చిత్రానికి U/A సర్టిఫికెట్ జారీ చేశారు. సినిమా నిడివి 2 గంటల 41 నిమిషాలుగా ఖరారైంది. తెలుగులో ఈ సినిమాను విఘ్నేశ్వర ఎంటర్‌టైన్‌మెంట్స్, ఆర్ స్టార్ లాజిస్టిక్స్ పతాకాలపై సీహెచ్ సతీష్ కుమార్, రాజేష్ కుమార్ బొబ్బర విడుదల చేస్తున్నారు. ఇటీవల హైదరాబాద్‌లో ఈ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్ కూడా ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ధనుష్ స్వయంగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 'కర' ఒక సాధారణ వ్యక్తి అసాధారణ పరిస్థితుల్లో చిక్కుకున్న కథ అని, దర్శకుడు విఘ్నేష్ అద్భుతమైన ప్రతిభ ఉన్న వ్యక్తి అని ప్రశంసించారు. ఈ చిత్రంలో ధనుష్ సరసన మమితా బైజు హీరోయిన్‌గా నటించగా, జీవీ ప్రకాష్ కుమార్ సంగీతం అందించారు. వెల్స్ ఫిల్మ్ ఇంటర్నేషనల్ పతాకంపై ఇషారి కె. గణేష్ ఈ చిత్రాన్ని నిర్మించారు.

# అషు రెడ్డి కేసులో ఆడియో లీక్..

ఏప్రిల్ 29 హిందూస్థాన్ మీడియా



నటి, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్ అషు రెడ్డిపై నమోదైన చీటింగ్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. బాధితుడైన ఎన్నారై ధర్మేంద్రను అషు రెడ్డి హెచ్చరిస్తున్నట్లుగా చెబుతున్న ఓ ఆడియో క్లిప్ సోషల్ మీడియాలో కలకలం రేపుతోంది. ఇదే సమయంలో, తనపై నమోదైన ఎఫ్ఐఆర్‌ను కొట్టివేయాలని కోరుతూ అషు రెడ్డి తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. లీకైన ఆడియో ప్రకారం.. ధర్మేంద్ర నుంచి తీసుకున్న డబ్బులో రూ. 1.5 కోట్లను మే నెలలో తిరిగి ఇస్తానని, మిగిలిన మొత్తం తాను జీవితంలో స్థిరపడ్డాక చెల్లిస్తానని అషు రెడ్డి చెప్పినట్లుగా ఉంది. తన కుటుంబ సభ్యులను ఈ వివాదంలోకి లాగితే, వేధింపుల కింద ఎదురు కేసు పెడతానని హెచ్చరించినట్లు సమాచారం. నటి ప్రవీణ, జ్యోతిష్యుడు వేణు స్వామి మధ్యవర్తిత్వంలో ఈ విషయాన్ని పరిష్కరించుకుందామని కూడా ఆ ఆడియోలో ప్రస్తావించినట్లు వార్తలు వస్తున్నాయి. లండన్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న ధర్మేంద్ర అలియాస్ వెంకట్‌ను పెళ్లి చేసుకుంటానని నమ్మించి, అషు రెడ్డి 2018 నుంచి సుమారు రూ. 9.35 కోట్లు, 5 కిలోల బంగారం, లగ్జరీ కార్లు, ఫ్లాట్లు తీసుకున్నారని ధర్మేంద్ర తండ్రి సత్యనారాయణ హైదరాబాద్ సీసీఎస్ పోలీసులకు ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే. ఈ ఫిర్యాదు ఆధారంగా పోలీసులు అషు రెడ్డి, ఆమె కుటుంబ సభ్యులపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. తాజా పరిణామాలతో అషు రెడ్డి ఈ కేసును కొట్టివేయాలని హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. మరోవైపు, ఈ ఆడియో టేపుల వాస్తవికతను పోలీసులు ఇంకా ధృవీకరించలేదు. ప్రస్తుతం ఈ కేసు దర్యాప్తు కొనసాగుతోంది.

# డూప్స్ లేకుండా మన హీరోలు ఫైట్లు చేయరు..
# 90 శాతం మంది అలాగే చేస్తున్నారు

ఏప్రిల్ 29 హిందూస్థాన్ మీడియా

విలక్షణ నటుడిగా, ప్రయోగాత్మక చిత్రాల దర్శకుడిగా తెలుగు సినీ పరిశ్రమలో తనకంటూ ఓ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న రవిబాబు మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. తన దర్శకత్వంలో రాబోతున్న కొత్త చిత్రం 'రేజర్' ప్రమోషన్ కార్యక్రమాల్లో భాగంగా ఆయన మాట్లాడుతూ.. టాలీవుడ్ స్టార్ హీరోల పనితీరు, యాక్షన్ సన్నివేశాల చిత్రీకరణపై తీవ్ర అసంతృప్తిని, ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. ఆయన చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం పెను దుమారం రేపుతున్నాయి.

### డూప్స్ లేకుండా ఫైట్ చేయరు

ఒక ఇంటర్వ్యూలో రవిబాబు మాట్లాడుతూ... "మన టాలీవుడ్ ఇండస్ట్రీలో ఉన్న హీరోలలో 90 శాతం మంది స్వయంగా ఫైట్లు చేయరు. కేవలం డూప్స్ సహాయంతోనే యాక్షన్ సన్నివేశాలను పూర్తి చేస్తారు" అంటూ బాంబు పేల్చారు. తెలుగు సినిమాల్లోని యాక్షన్ ఘట్టాలు వాస్తవికతకు ఆమడ దూరంలో ఉంటాయని, వాటిలో ఎలాంటి లాజిక్ ఉండదని ఆయన అభిప్రాయపడ్డారు. "కావలసినంత సమయం, డబ్బు ఇస్తే ఎలాంటి వెధవ అయినా ఇక్కడ సినిమా చేయగలడు" అంటూ ఘాటైన విమర్శలు చేశారు. ఈ వ్యాఖ్యలు నేరుగా హీరోల సామర్థ్యాన్ని, పరిశ్రమలోని పోకడలను ప్రశ్నించేలా ఉన్నాయి.

### మిస్టరీని చంపేస్తున్న సోషల్ మీడియా

ప్రస్తుత సినిమా నిర్మాణ శైలిపైనా రవిబాబు ఆవేదన వ్యక్తం చేశారు. సోషల్ మీడియా కారణంగా సినిమాలకు సంబంధించిన మిస్టరీ పూర్తిగా కనుమరుగైపోతోందన్నారు. "సినిమా విడుదల కాకముందే లీకులు వచ్చేస్తున్నాయి. పబ్లిసిటీ పేరుతో ప్రతి చిన్న విషయాన్ని బయటపెట్టడం వల్ల సినిమాపై ప్రేక్షకుడికి ఉండాల్సిన ఆసక్తి చచ్చిపోతోంది. ఒకప్పుడు షూటింగ్ స్పాట్‌లో నటులను చూడటమే గగనంగా ఉండేది, కానీ ఇప్పుడు అంతా బహిరంగంగా మారిపోయింది" అని ఆయన విమర్శించారు.

### 'రేజర్'లో అంతా నేచురల్




అయితే, తన తాజా చిత్రం 'రేజర్' విషయంలో పూర్తి భిన్నమైన పంథాను అనుసరించినట్లు రవిబాబు తెలిపారు. ఈ సినిమాలో ఏ ఒక్క సన్నివేశంలోనూ డూప్ ను వాడలేదని, ఫైట్ సీక్వెన్స్‌లను చాలా సహజంగా, వాస్తవికతకు దగ్గరగా చిత్రీకరించామని స్పష్టం చేశారు. తనీష్, బెనర్జీ కీలక పాత్రలలో నటించిన ఈ చిత్రాన్ని సురేశ్ బాబు సమర్పణలో ఫ్లయింగ్ ఫ్రాగ్స్ ప్రొడక్షన్ పతాకంపై నిర్మించారు. వినూత్న కథాంశంతో రాబోతున్న ఈ చిత్రం మే 8న ప్రేక్షకుల ముందుకు రానుంది. రవిబాబు వ్యాఖ్యల నేపథ్యంలో 'రేజర్'లో ఆయన చెప్పిన సహజత్వం ఎలా ఉంటుందో చూడాలని ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

Publisher: AKULA SWATHI , printed at SUNDAY PRINTING PRESS, FLAT. NO.363B,1st FLOOR,MADHAVARAM NAGAR COLONY ,RANGAREDDY, TELANGANA - 500072 .
Published at H.NO.15-56/1, Village & Mandal CHERIAL , SIDDIPET District ,Telangana state - 506223, Editor :THADEM PRASHANTH Cell :9000306455